quicktodaynews.com RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే


QUICK TODAY DAILY దినపత్రిక


## విలేకరులు కావలెను

పత్రిక ప్రారంభించిన అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన క్విక్ టుడే తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణలోని అన్ని జిల్లాలకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన వారికి మాత్రమే ప్రాధాన్యం.
తగిన గౌరవ వేతనం ఇవ్వబడును.

వివరాలకు వెంటనే సంప్రదించగలరు 8886460073 8125972476 క్విక్ టుడే www.quicktodaynews.com తెలుగు దినపత్రిక


EDITOR : GILLALA BUCHI REDDY | మల్కాజిగిరి | సంపుటి : 1 సంచిక : 240 | గురువారం, మే 23 2024 | వెల : 3 రూ/.. | పేజీలు - 8



## మరోమారు అధికారం
# ఎన్‌డిఎదే...



**న్యూఢిల్లీ,(క్విక్ టుడే) :** లోక్‌సభ ఎన్నికలు తుది దశకు వచ్చాయి. మరో రెండ- విడతల్లో దేశంలోని 543 ఎంపీ స్థానాలకు ఎన్నికలు ముగియనున్నాయి. అయితే, ఈ సారి ఎన్నికల్లో మొత్తం అంకెల చుట్టూ తిరుగుతోంది. బీజేపీ స్వయంగా 370 సీట్లు, ఎన్డీయే కూటమి మొత్తంగా 400 కన్నా ఎక్కువ స్థానాలు గెలుస్తుందని బీజేపీ నేతలు చెబుతున్నారు. మరోవైపు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఈసారి బీజేపీ కేవలం 200 కన్నా తక్కువ స్థానాలకే పరిమితమవుతుంది, ఇండియా కూటమి 300 స్థానాలను కన్నా ఎక్కువ గెలుచుకుని అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేస్తోంది. వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ కూడా బిజెపి 300కు పైగా సీట్లను గెల్చుకుంటుందని విశ్లేషణ చేశారు. ఈ క్రమంలో 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 305 గెలుచుకుంటుందని అమెరికన్ పొలిటికల్ సైంటిస్ట్, గ్లోబల్ పొలిటికల్ రిస్క్ కన్‌స్టలెంట్ ఇయాన్ బ్రెమ్మర్ మంగళవారం జాతీయ ఛానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ప్రపంచ రాజకీయ దృక్కోణం లో భారత సార్వత్రిక ఎన్నికలు స్థిరంగా కనిపించే ఏకైక విషయమని, మిగతావన్నీ అమెరికా ఎన్నికలతో సహా సమస్యాత్మకంగా కనిపిస్తున్నాయని అన్నారు. ప్రస్తుతం భౌగోళిక రాజకీయాలు నిశ్చితిలో ఉన్నాయని అన్నారు. ప్రపంచీకరణ కంపెనీలు కోరుకున్న విధంగా జరగడం లేదని చెప్పారు. రాజకీయాలు ప్రపంచ మార్కెట్లోకి ప్రవేశించడం.. యుద్ధాలు, యూఎస్-చైనా సంబంధాలు, అమెరికా ఎన్నికలు అన్ని ఇందులో భాగమే అని అన్నారు. ఈ ఒత్తిళ్లు మరింత ప్రతికూలంగా ఉన్నాయని, వాస్తవానికి రాజకీయంగా స్థిరంగా కనిపించే ఏకైక విషయం భారతదేశ ఎన్నికలే అని, మిగతావన్నీ సమస్యాత్మకంగా ఉన్నాయని చెప్పారు. ఏడు దశల్లో జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 295-315 సీట్లు గెలుస్తుందని అంచనా వేశారు. ఇదిలా ఉంటే ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కూడా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి మరోసారి అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు. 2019లో సాధించిన సీట్లకు అటూ ఇటూగా లేదా, దాని కన్నా కొన్ని స్థానాలు ఎక్కువగా బీజేపీ గెలుచుకుంటుందని, ఆ పార్టీ చెప్పినట్లు 370 సీట్లు సాధించలేదని చెప్పారు. ప్రపంచంలోని పలు దేశాల్లో ఎన్నికలు ఉన్నాయని,

మిగతా 2లో...

## కుటుంబ సమేతంగా శ్రీవారిని
# దర్శించుకున్న సిఎం రేవంత్

- ప్రత్యేక దర్శనం చేయించిన అధికారులు
- ప్రజలు సంతోషంగా ఉండాలని కోరుకున్నట్లు వెల్లడి



**తిరుమల,(క్విక్ టుడే) :** తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారిని సీఎం రేవంత్ రెడ్డి దర్శించుకున్నారు. కుటుంబసభ్యులతో కలిసి శ్రీవారికి మెక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రికి వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్ద టీటీడీ అధికారి హరీంద్రనాథ్ స్వాగతం పలికి దర్శన

మిగతా 2లో...



## విపక్షాలకు అధికారమిస్తే
# జన్‌ధన్ ఖాతాలు కట్

### - యూపి ప్రచారంలో ప్రధాని మోడీ హెచ్చరిక

**లక్నో,మే22(క్విక్ టుడే) :** ప్రతిపక్షాలు అధికారంలోకి వస్తే జనధన్ బ్యాంక్ ఖాతాలు మూసి వేసి అందులోని నగదు లాగేసుకొంటాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. తన ప్రభుత్వ హయాంలో పేదవారి కోసం దాదాపు 50 కోట్లకు పైగా జనధన్ యోజన ఖాతాలను ప్రారంభించానని తెలిపారు. బుధవారం ఉత్తరప్రదేశ్ లోని శ్రావస్థిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఆ ఖాతాలన్నీ ప్రతిపక్షాలు మూసి వేస్తాయని ప్రధాని మోదీ స్పష్టం చేశాయి. ప్రధానిగా తాను దేశంలో ప్రతీ గ్రామానికి విద్యుత్ సరఫరా తీసుకు వచ్చానన్నారు. అదే ప్రతిపక్షం అధికారంలోకి వస్తే మాత్రం ఆ యా గ్రామాలన్నీ విద్యుత్ కోతల ద్వారా చీకటిలోకి నెట్టేస్తాయని విమర్శించారు. ఇక ప్రతీ ఇంటికి తాను కుళాయి ద్వారా నీళ్లు అందించానని గుర్తు చేశారు. అయితే ఇంటికి దూరంగా నీటి కుళాయిలు ఏర్పాటు చేయ గల నైపుణ్యంలో ప్రతిపక్షాలు పేరు సంపాదించాయని చెప్పారు. ఇక 4 కోట్ల మంది పేద ప్రజలకు కోసం నిర్మించిన ఇళ్లు.. ఎస్పీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు వాళ్ల ఓటు బ్యాంక్‌కు కట్టబెడతారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఏం చేసినా.. దానికి విరుద్ధంగా చేయడం ఎస్పీ, కాంగ్రెస్ పార్టీల ప్రత్యేకత అని ప్రధాని మోదీ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తే.. ప్రస్తుతం జైల్లో ఉన్న తీవ్రవాదులందరని.. ప్రధానమంత్రి తన నివాసంలో బిర్యానీ తినేందుకు

మిగతా 2లో...

## బిఆర్ఎస్ ప్రభుత్వం కన్నా
# మెరుగ్గా కొనుగోళ్లు

- ఆనాడు వరికుప్పలపైనే రైతులు ప్రాణాలు వదిలారు
- ఇప్పుడు ధైర్యంగా పంటలు అమ్ముకుంటున్నారు
- సన్న ధాన్యం ప్రోత్సాహం కోసమే 500 బోనస్
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి



**హైదరాబాద్,మే22(క్విక్ టుడే) :** బీఆర్ఎస్ ప్రభుత్వంతో పోలిస్తే కాంగ్రెస్ పాలనలో వ్యవసాయం, ధాన్యం సేకరణ వేయి పాళ్లునయమని, ఇది తెలంగాణ రైతుల అభిప్రాయం అనివ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలియజేసారు. గతంతో పోలిస్తే ముందస్తుగానే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసామని, చురుకుగా కొనుగోళ్లు సాగుతున్నాయని అన్నారు. తెలంగాణలో సన్న వడ్ల సాగును పెంచేందుకు 500 బోనస్ ఇస్తున్నట్లు ప్రకటించారు. తెలంగాణలో దొడ్డు వడ్లు తినడం చాలా తగ్గిపోయింది. గత ప్రభుత్వంలో సన్న బియ్యం పేరుతోటి దొడ్డు వడ్లనే పాలిష్ చేసి అంగన్వాడీలకు, మధ్యాహ్న భోజన పథకానికి వినియోగించేవారు. అలా కాకుండా పేదలు కూడా పెద్దోళ్లు తినే సన్న బియ్యం తినాలనే సంకల్పంతో రేషన్ దుకాణాల్లో కూడా సన్న బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని పెట్టుకుంది. కానీ ఇతర రాష్ట్రాల నుంచి సన్నబియాన్ని దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇకపోతే ఐకేపీ సెంటర్ల పెంపు గత ఏడాదితో పోలిస్తే నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అదనంగా కొనుగోలు చేసామని, ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణకు జిల్లాకొక ఐఏఎస్ ను నియమించి ఎప్పటికప్పుడు సమీక్ష చేయిస్తున్నా మన్నారు. తరుగు, తాలు పేరుతో కోతలు లేవు.. గతంలో ప్రతి క్వింటాకు 7 నుంచి 10 కేజీల వరకు తరుగు పేరుతో మిల్లర్ల దోపిడీ.. ఈ దఫా మిల్లర్ల దోపిడీ పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపడంతో కోతలకు మిల్లర్ల స్వస్తి చెప్పారని అన్నారు. దీంతో ప్రతి కింటా పై రైతుకు 150 నుంచి 200

మిగతా 2లో...

### మారిన టిఎస్ ఆర్టీసీ పేరు
## ఇకనుంచి టిజిఎస్ ఆర్టీసీగా మార్పు




**హైదరాబాద్,(క్విక్ టుడే) :** తెలంగాణ ఆర్టీసీ పేరులో మార్పు చోటుచేసుకుంది. ప్రభుత్వం ఆదేశాల మేరకు మార్పు చేస్తూ నిర్ణయం తీసుకున్నది. ఇప్పటి వరకు టీఎస్ ఆర్టీసీగా కొనసాగగా.. ప్రస్తుతం టీజీఎస్‌ఆర్టీసీగా మారింది. ఇటీవల ప్రభుత్వం టీఎస్ స్థానంలో టీజీగా మార్పులు చేస్తూ

మిగతా 2లో...

### గాడి తప్పుతున్న
## నేతల ప్రచారం

- ప్రధాన పార్టీల తీరుపై ఇసి ఆగ్రహం
- కాంగ్రెస్, బిజెపి అధ్యక్షులకు నోటీసులు




వివరాలు 2లో

### తెలంగాణలో మరో మూడు రోజులు
## వర్షాలు

**హైదరాబాద్,మే22(క్విక్ టుడే) :** తెలంగాణలో మరో మూడురోజులు తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. 23న భూపాలపల్లి, ములుగు,



కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, సంగారెడ్డి, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో

మిగతా 2లో...

### మళ్లీ కరెంట్
## కోతలు..

- ఆరు నెలల్లోనే ఆరుదశాబ్దాలు దౌర్భాగ్యం
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ ట్వీట్



**హైదరాబాద్,మే22(క్విక్ టుడే) :** గత ఆరు దశాబ్దాల కన్నీటి దృశ్యాలు.. 6 నెలల కాంగ్రెస్ పాలనలోనే ఆవిష్కృతమయ్యాయని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్(ట్విటర్) వేదికగా విమర్శించారు. పదేళ్లు లేని కరెంట్ కోతలను మళ్లీ చూస్తున్నామన్నారు. విద్యుత్తు సబ్ స్టేషన్ల ముట్టడి చూస్తున్నట్లు తెలిపారు. మోటార్లు కాలుతున్నాయని, ట్రాన్స్‌ఫార్మర్లు పేలుతున్నాయని ఎద్దేవా చేశారు. మళ్లీ చాన్నాళ్లకు ఇన్వర్టర్లు, జనరేటర్ల మోతలు చూస్తున్నట్లు

మిగతా 2లో...

(మొదటి పేజీ తరువాయి)

## మరోమారు అధికారం ఎన్‌డిఏదే

అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ సున్నితమైన ఎన్నికల పక్రియను కలిగి ఉందని బ్రెమ్మర్ ప్రశంసించారు. బలమైన ఆర్థిక పనితీరు, స్థిరమైన సంస్కరణలతో మోడీ మూడోసారి గెలువబోతున్నారని అన్నారు. దశాబ్దాలుగా భారత్ పనితీరును పలు దేశాలు తక్కువగా చూసినప్పటికీ, ప్రస్తుత అమెరికన్ సీఈఓలు భారత్ వస్తున్నారని, తాము వృద్ధిని చూస్తున్నామని, భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడాన్ని చూశామని, బహుశా 2028 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించొచ్చని ఆయన అన్నారు. మిగిలిన దేశాలతో తన స్నేహాన్ని నిర్వహించే విషయంలో భారత్ శక్తివంతంగా మారడాన్ని ప్రపంచం చూస్తోందని చెప్పారు.

## కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్న సిఎం రేవంత్

ఏర్పాట్లు చేశారు.రేవంత్ రెడ్డి ఉదయం శ్రీవారికి తన మనవడి పుట్టువెంట్రుకల మెక్కు చెల్లించుకున్నారు. అనంతరం ఉదయం 8.30 గంటలకు వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో రేవంత్ కుటుంబానికి ఆలయ పండితులు వేదాశీర్వచనం అందించారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి స్వామివారి తీర్థప్రసాదాలు అందేశారు.తెలంగాణరాష్ట్రాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని ప్రార్థించినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిచెప్పారు.సంప్రదాయ దుస్తులు ధరించి భార్య, కూతురు, మనవడు, అల్లుడితో కలిసి శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు, పూజారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. వైకుంఠ ద్వారం గుండా శ్రీవారి ఆలయంలోకి ప్రవేశించి కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు. అంతకంటే ముందు ఉదయం తన మనవడి పుట్టెటెంటుకలను స్వామి వారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏర్పడబోయే ప్రభుత్వంతో మంచి సత్సంబంధాలు కలగి ఉండాలని ఆకాంక్షించారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించానని రేవంత్ చెప్పారు. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం తమ వంతు సేవలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం సైతం సహకరిస్తుందని ప్రకటించారు. కాగా, తెలంగాణలో కాంగ్రెస్ పాలనలో రైతులు సంతోషంగా ఉన్నారని అన్నారు. సకాలంలో వర్షాలు కురవడంతో నీటి సమస్యలు తీరాయన్నారు. స్వామివారి ఆశీస్సులతో తెలంగాణతో పాటు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూడా అభివృద్ధి చెందాలని కోరుకున్నానని సీఎం రేవంత్ చెప్పారు. తిరుమల వెంకన్నను దర్శించుకున్న అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తిరుగుపయనం అయ్యారు. తిరుమల నుంచి రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరారు. రేణిగుంట నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు బయలుదేరారు.

## బిఆర్ఎస్ ప్రభుత్వం కన్నా మెరుగ్గా కొనుగోళ్లు

రూపాయల వరకు అదనపు లబ్ది చేకూర్చామన్నారు. రైతులు పంట అమ్ముకున్న ఐదు రోజుల్లోనే రైతుల ఖాతాల్లోకి నగదు జమ అవుతోందని, గతంలో 45 రోజులు పెట్టేదన్నారు. రైతు ఎంతో వడ్డీ నష్ట పోయేవాడు. కానీ ఇప్పుడు కేవలం 5 రోజుల్లోనే రైతు ఖాతాల్లో నగదు జమ అవుతుంది దీంతో రైతుకు వడ్డీ వ్యాపారుల వేధింపులు లేవు. వడ్డీలు కట్టాల్సిన అవసరం లేదు. ఆత్మగౌరవంతో ఇప్పుడు రైతు బతుకుతున్నాడని, కేసీఆర్ ప్రభుత్వంలో ఫసల్ బీమా యోజన లేదు. ఉంటే కనీసం పంట నష్టపరిహారం వచ్చేదన్నారు. అయినప్పటికీ కాంగ్రెస్, రైతు ప్రభుత్వం కాబట్టి పంట నష్టపోయిన రైతాంగానికి పంట నష్టపరిహారాన్ని కూడా కాంగ్రెస్ పార్టీ అందిస్తోందన్నారు. అంతే గాక, ఇక ముందు ఏ ఒక్క రైతు కూడా ఇలా నష్టపోకుండా, ప్రభుత్వమే రైతుల ప్రీమియం చెల్లించి పంట భీమా పథకాన్ని 3,000 కోట్ల రూపాయలు వెచ్చించి వానాకాలం నుండి అమలు చేస్తున్నామన్నారు. అలాగే తడిచిన ధాన్యాన్ని సైతం ఈ ప్రభుత్వం సేకరిస్తుంది. గతంలో కల్లాల్లో వరికుప్పలమీద రైతులు గుండె పగిలి చనిపోయారు. కానీ మాది రైతు ప్రభుత్వం అని తెలిసి రైతులు గుండె ధైర్యంతో బతుకుతున్నారు. అందుకే మనం దొడ్డు వడ్లు అమ్ముకొనుడెంది, సన్న వడ్లు కొనుక్కునుడేంది.. మనమే మనకు అవసరమైనంత సన్న వడ్లను ఉత్పత్తి చేసుకునేందుకు ఈ బోనస్ పథకాన్ని ప్రవేశపెట్టాము. నాట్లేసుకునే సమయం దగ్గర పడుతుంది కాబట్టి యుద్ధ ప్రాతిపదికన ఈ స్కీమును ప్రవేశపెట్టాం. భవిష్యత్తులో దొడ్డు వడ్లకు కూడా ఈ స్కీములు వర్తింప చేస్తాము. దొడ్డు వడ్లకు 500 రూపాయలు ఇప్పుడు ఇవ్వలేకపోయినా?మూడు నుంచి ఐదు రోజుల్లోనే డబ్బులు చెల్లిస్తూ, మిల్లర్ల ధాన్యం కోతను అరికడుతూ.. ప్రత్యక్షంగా అంతమేరా రైతుకు ఈ ప్రభుత్వం లబ్ది చేకూరుస్తోంది. అది తెలుసు కనుకనే తెలంగాణ రైతులు నిశ్చింతగా ఉన్నారు.

## మళ్లీ కరెంట్ కోతలు.

చెప్పారు. సాగునీరు పంట పొలాలు ఎండుతున్నాయన్నారు. ట్రాక్టర్లు ఉండాల్సిన పొలంలో ట్యాంకర్లు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. చుక్కనీరు లేక బోసిపోయిన చెరువులు దర్శనమిస్తున్నాయి. పాత అప్పు కట్టాలని రైతులకు నోటీసులు వస్తున్నాయి. రైతుబంధు కోసం నెలలపాటు పడిగాపులు కాయాల్సి వస్తోంది. తడిసిన ధాన్యాన్ని కొనే దిక్కు లేదు. పదేళ్ల తరువాత అన్నదాతల ఆత్మహత్యలు చూస్తున్నాం. విత్తనాల కోసం రైతుల మొక్కులు.. క్యూలైన్ లో పాసుబుక్కులు చూస్తున్నాం. కాంగ్రెస్ పాలనలో ఇలాంటి విషాద దృశ్యాలు ఇంకెన్ని చూడాలో. ఎంజీఎం ఆసుపత్రిలో 5 గంటల విద్యుత్ కోత బాధాకరం. ఆసుపత్రులను కూడా ఈ ప్రభుత్వం నిర్వహించలేకపోతోంది.

## తెలంగాణలో మరో

కూడిన వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది. 24న జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. 25న భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, నాగర్ కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో వానలు పడే అవకాశాలున్నాయని వివరించింది.

## గాడి తప్పుతున్న నేతల ప్రచారం

**న్యూఢిల్లీ,మే22:** సార్వత్రిక ఎన్నికల ప్రచారాల్లో నిమగ్నమైన ప్రధాన రాజకీయ పార్టీలు.. విమర్శనాస్త్రాలతో ప్రత్యర్థులపై విరుచుకుపడుతున్నాయి. ఈ క్రమంలో అగ్ర నేతలు, ముఖ్య ప్రచారకర్తలు చేసే ప్రసంగాలు గాడి తప్పుతున్నాయంటూ ఎన్నికల సంఘం కన్నెర్ర చేసింది. ప్రచారాల్లో కుల, మత ప్రస్తావనలను తీసుకురావడంపైనా విరుచుకుపడింది. నేతల ప్రచారశైలిలో మార్పు రావడం లేదని, ఇకనైనా సరిదిద్దుకోవాలని పేర్కొంటూ భాజపా, కాంగ్రెస్ జాతీయాధ్యక్షులకు నోటీసులు జారీ చేసింది.ఎన్నికల ప్రచారాల్లో మతపరమైన అంశాలకు దూరంగా ఉండాలని భాజపా, కాంగ్రెస్ పార్టీలకు ఎన్నికల సంఘం సూచించింది. ముఖ్యంగా సమాజంలో విభజనకు దారితీసే ప్రసంగాలను వెంటనే ఆపాలని భాజపాకు స్పష్టం చేసింది. రాజ్యాంగం రద్దవుతుందనే తప్పుడు అభిప్రాయం కలిగించే ప్రకటనలకు దూరంగా ఉండాలని కాంగ్రెస్‌ను ఆదేశించింది. అగ్నివీర్ వంటి పథకాలపై ప్రసంగాలు చేసేటప్పుడు.. సాయుధ బలగాలను రాజకీయం చేయవద్దని పేర్కొంది. భాజపా, కాంగ్రెస్‌లు ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకోవడం, వాటిని సమర్థించుకోవడాన్ని ఎన్నికల సంఘం తోసిపుచ్చింది.

## మారిన టిఎస్ ఆర్టీసీ పేరు

ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇక నుంచి నివేదికలు, ప్రభుత్వ ఉత్తర్వులు, లెటర్ హెడ్‌లపై టీఎస్‌కి బదులు టీజీగా పేర్కొనాలని ఆదేశించింది. ఈ మేరకు కేంద్రం అనుమతి ఇస్తూ గెజిట్ జారీ చేసిన విషయం తెలిసిందే. గతంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల బోర్డులు, ప్రభుత్వ పరంగా టీఎస్‌గా రాసే విషయం తెలిసిందే. గతేడాది డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం టీఎస్ స్థానంలో టీజీని మార్పు చేస్తూ కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. కేంద్రం అనుమతులు జారీ చేసిన విషయం తెలిసిందే. మొదటగా మార్చిలో వాహనాల రిజిస్ట్రేషన్లకు సంబంధించి టీఎస్ తొలగించి టీజీగా మార్చింది. ఇటీవల ప్రభుత్వ కార్యాలయాల్లోనూ మార్పులు చేయగా.. తాజాగా ఆర్టీసీ సైతం టీజీఎస్ ఆర్టీసీగా మార్పులు చేసింది. సంస్థ ఎండీ సజ్జనార్ సైతం సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు టీఎస్ఆర్టీసీ పేరును టీజీఎస్ఆర్టీసీగా మార్చడం జరిగిందన్నారు.

## విపక్షాలకు అధికారమిస్తే

ఆహ్వానిస్తారన్నారు. అలాగే ఉత్తరప్రదేశ్‌లో ఎన్నికల ర్యాలీలో పాల్గొంటున్న కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్‌లపై ప్రధాని మోదీ ఈ సందర్భంగా వ్యంగ్య బాణాలు సంధించారు.వీరిద్దరు పాల్గొంటున్న బహిరంగ సభలకు భారీగా జనం తరలివచ్చిన కొన్ని వీడియోలను తాను చూశానని ప్రధాని మోదీ తెలిపారు. ఈ సభలకు హాజరయ్యేందుకు ఈ రెండు పార్టీలు ప్రజలకు నగదు పంచి పెడుతున్నాయని.. అందుకే వారంతా వస్తున్నారని మోదీ విమర్శించారు. ప్రజలకు నగదు ఇవ్వకుండా ర్యాలీలకు తీసుకు రావాలని ఎస్పీ, కాంగ్రెస్ పార్టీల నేతలకు ప్రధాని మోదీ సూచించారు.
















# పట్టభద్రుల ఉప ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

## ఎన్నికల రిటర్నింగ్ అధికారి నల్లగొండ జిల్లా కలెక్టర్ దాసరి హరి చందన




**నల్లగొండ జిల్లా ప్రతినిధి.మే 22. (క్విక్ టుడే) :** వరంగల్- ఖమ్మం- నల్గొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల రిటర్నింగ్ అధికారి ,నల్గొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ కు తెలియజేశారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ హైదరాబాద్ నుండి వరంగల్- ఖమ్మం- నల్గొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల ఏర్పాట్లపై నల్గొండ జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన తోపాటు, ఉప ఎన్నికలు జరిగే 12 జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ ఆదనపు కలెక్టర్లు,ఏ ఆర్ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శాసనమండలి పట్టభద్రుల ఉపఎన్నికకు సంబంధించి చేసిన ఏర్పాట్లపై సీఈవో అడిగగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నిక పరిధిలో 600 పోలింగ్ కేంద్రాలు, మరో 5 ఆక్సిలరి పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, అన్ని పోలింగ్ కేంద్రాలలో అవసరమైన కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 5 లక్షల బ్యాలెట్ పేపర్లు రాష్ట్రస్థాయి నుండి రావడం జరిగిందని ,వాటన్నిటిని సంబంధిత జిల్లాలకు పంపించామని, పోలింగ్ కు అవసరమైన బ్యాలెట్ బాక్సులు సైతం సిద్ధంగా ఉన్నాయని, ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బందిని కేటాయించడం జరిగిందని, వీరందరికీ మొదటి విడత శిక్షణ కార్యక్రమాలను సైతం పూర్తి చేసినట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ఉద్యోగులకు ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు నల్గొండ జిల్లా కేంద్రంలోనే ఏర్పాటు చేస్తున్నామని, 96 టేబుల్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నికను ఆషామాసిగా తీసుకోవద్దని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ఉద్యోగులకు ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, ఎన్నికలలో ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం సరఫరా చేసిన వైలెట్ కలర్ స్కెచ్ పెన్, ఇండెలిబుల్ ఇంకు లు మాత్రమే వినియోగించాలని తెలిపారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికలు ముగిసినందున ఎం ఎల్ సి ఎన్నికలలో ఓటరు ఎడమ చేయి మధ్య వేలుకు ఇండెలిబుల్ ఇంక్ మార్కు చేయాలని, ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థుల జాబితాను ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బయట ప్రదర్శించాలని, అదేవిధంగా ఓటర్లు ఓటు ఎలా వేయాలో ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేయాలని సూచించారు. అంతకుముందు నల్గొండ జిల్లా కలెక్టర్ ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన జిల్లాల అదనపు కలెక్టర్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో ఎం ఎల్ సి ఎన్నికల పై సూచనలు చేశారు. ముఖ్యంగా పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్స్ లను రిసెప్షన్ కేంద్రానికి తీసుకురావడంలో పూర్తి జాగ్రత్తలుతీసుకోవాలని, అవసరమైన టార్పాలిన్లతో క్లోస్డ్ కంటైనర్ వాహనాలలో తేవాలని, ఈనెల 24న ఇతర పోలింగ్ సిబ్బంది మెటీరియల్ వస్తుందని దానిని తీసుకోవాలని,తక్షణమే పోలింగ్ సిబ్బంది ఉత్తర్వులను పంపించాలని, ఈ నెల 24న పోలింగ్ సిబ్బంది రండమైజేషన్ నిర్వహించడం జరుగుతుందని ఆమె వెల్లడించారు. జిల్లా ఎస్పీ చందన దీప్తి ,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె శ్రీనివాస్ నల్గొండ, మిర్యాలగూడ ఆర్డీవోలు, ఏఆర్వోలు రవికుమార్, శ్రీనివాసరావు, స్పెషల్ కలెక్టర్ నటరాజ్ తదితరులు జిల్లా నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరుకాగా, రాష్ట్రస్థాయి నుండి ఆదనపు సీఈవోలు సర్ఫరాజ్, లోకేష్ కుమార్, డిప్యూటీ సి ఈవో ఎల్ సత్యవాణి తదితరులు హాజరయ్యారు.

## ఏబీఏపీ నిర్మల్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక




**నిర్మల్** భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ నిర్మల్ జిల్లా నూతన కార్యవర్గాన్ని భైంసా లోఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా కర్మ సిద్ధు, ఎన్నికల అబ్జర్వర్ మూడ శ్రీనివాస్ వ్యవహరించారు.నిర్మల్ జిల్లా అధ్యక్షులుగా బి.సునీల్ దత్, ఉపాధ్యక్షులుగా విఠలాచారి, కార్యదర్శిగా చాదల శివకుమార్,ఉప కార్యదర్శిగా వివేకానంద, కోశాధికారిగా పెంటాజి యాదవ్, జిల్లా కమాండర్ గా కృష్ణ గౌడ్,జిల్లా పిఆర్ఓగా నాగనాథ్,ఈసీ మెంబర్లుగా కె.కృష్ణ,జంగ రమేష్ ను ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కార్యవర్గం సభ్యులు మాట్లాడుతూ. భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ నూతన కార్యవర్గం అధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు లక్ష్యంగా ముందుకు సాగించే విధంగా కృషి చేస్తామని పేర్కొన్నారు.అనంతరం వారిని శాలువాతో ఘనంగా సత్కరించి సన్మానించారు.

## తీన్మార్ మల్లన్నకు తిరుగులేదని పట్టుభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం మనదే



**ములకలపల్లి మే 22** /భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గం ములకలపల్లి మండలం ముత్యాలపాడు గ్రామ పంచాయతీ తీన్మార్ మల్లన్న కు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న ప్రశ్నించే గొంతుకై ప్రజా సమస్యల కోసం పోరాడుతున్న తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భక్తి ఇన్చార్జి సామల పవన్ కుమార్ కో ఇన్ఛార్జ్ వేమన్న ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ లీడర్లను కలిసి ప్రచారం చేయడం జరిగింది.ప్రచారంలో భాగంగా తీన్మార్ మల్లన్న టీం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ప్రశాంత్ గౌడ్ అశ్వరావుపేట నియోజకవర్గ సీనియర్ నాయకులు గాధేగోని జగదీష్.మడకం శ్రీనివాస్. మడకం సురేష్.మడకం కాంగ్రెస్ యువజన నాయకులు నరసింహారావు.మడకం రవి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రేస్ కె మా మద్దతు


### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



**జూలూరుపాడు మే,22:** నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు సిపిఐ పార్టీ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే, కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, జాతీయస్థాయిలో ఇండియా కూటమిలో సిపిఐ భాగస్వామిగా ఉన్నదని, అసెంబ్లీ ఎన్నికల్లోను కలిసే పోటీ చేశామని, ఆ పొత్తు లోక్సభ ఎన్నికల్లోనూ కొనసాగిందని,ఇప్పుడు గ్రాడ్యుయేట్ ఉప ఎన్నికల్లోను కొనసాగుతుందని ఆయన తెలిపారు.

## భారీ వృక్షాలు నేలకొరిగి రాకపోకలు స్తంభించాయి

**దమ్మపేట మే 22** నిన్న రాత్రి పడిన వర్షానికి సుమారు తొమ్మిది గంటల సమయంలో దమ్మపేట పాల్వంచ ప్రధాన రహదారిలో అనగా ఆర్లపెంట శివారు అడవిలో రెండు భారీ వృక్షాలు నేలకొరిగి రోడ్డుకి అడ్డంగా పడిపోయి రాకపోకలు చేయుటకు,డవిలో ఫోన్ సిగ్నల్స్ లేకుండా ఉండటం వల్ల ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందీ కలిగింది, దాదాపు రెండు గంటల తర్వాత అనగా రాత్రి 11 గంటల సమయంలో లంకాలపల్లి గ్రామానికీ చెందిన వంశీ




మణుగూరు వెళ్తుండగా సుమారు రెండు కిలోమీటర్ల దూరం వరకు ట్రాఫిక్ స్తంభించి, వాహనాలు నిలిచిపోవడాన్ని గమనించి ముందుకీ వెళ్ళే అవకాశం లేక తిరిగి అంకంపాలెం వచ్చి కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కాక రమేష్ కు సమాచారం ఇవ్వగా వెంటనే స్పందించి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సమాచారం తెలియచేసి కటింగ్ మిషన్, గొడ్డళ్లు తీసుకొని వెళ్ళి, సుమారు నాలుగు గంటల పాటు శ్రమించి రోడ్డుకు అడ్డంగా పడిపోయి ఉన్న రెండు భారీ వృక్షాలను తొలగించి సుమారు ఆరు గంటల నిరీక్షణ తర్వాత అనగా మధ్యరాత్రి రెండు గంటలకు వాహనాల రాకపోకలు తిరిగి ప్రారంభమైనాయి ట్రాపిక్ క్లియర్ అవడానికి సుమారు రెండు గంటల సమయం అనగా తెల్లవారుజామున నాలుగు గంటలకు అన్నీ వాహనాలను పంపివేసి ట్రాపిక్ క్లియర్ చేసి ఆ స్థలము నుండి తిరిగిరావడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు, జారే యువ సైన్యం సభ్యులు కాక రమేష్, కూరంనాగేష్, పొట్ట వెంకటరావు, వగ్గేల నవీన్, కొండ్రు సాయి, కూరం జయంత్, నందిగాం గౌతమ్, జుగేశ్, విష్ణు, చెన్నారావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వాడే వెంకటరావు వాహనదారులు, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంజీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ గోపాల్ రెడ్డి పదవీ విరమణ



**నల్లగొండ జిల్లా ప్రతినిధి.మే 22. (క్విక్ టూ డే) :** నల్గొండ జిల్లా అన్నెపర్తిలోని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రో.డా.గోపాలరెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మెన్ డా. బొమ్మర బోయిన కేశవులు ఘనంగా సత్కరించారు. బుధవారం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో డా.గోపాలరెడ్డి సన్మానించి మాట్లాడారు. యూనివర్సిటీ అభివృద్ధికి డా.గోపాల్ రెడ్డి ఎంతో కృషిచేసారని చెప్పారు. యూనివర్సిటీలో కోట్లాది రూపాయలతో మౌలిక సదుపాయాలకు పెద్ద పీట వేశారని, అకడమిక్ పరంగా ఎంతో అభివృద్ధి చేశారని వివరించారు. వీసీ గా పనిచేసిన ఆయన ముందు ముందు మరింత ఉన్నత పదవులు అధిరోహించాలని, భావి జీవితం ఆరోగ్యంగా, ఆనందంగా, ఉన్నతంగా గడిపేలా భగవంతుడు ఆశీస్సులు అందించాలని కోరుకుంటున్నారు.

## వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్యకు సన్మానం



**నల్లగొండ జిల్లా ప్రతినిధి మే 22. (క్విక్ టుడే ) :** వికలాంగుల సంక్షేమ శాఖ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య బుధవారం జిల్లా కేంద్రంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి క్యాంపు కార్యాలయానికి వచ్చిన సందర్భంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, నల్గొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్ బోకే అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జూలకంటి సైదిరెడ్డి, పట్టణ యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాలి నాగరాజు, మామిడి కార్తీక్, నంద్యాల వీర బ్రహ్మానంద రెడ్డి, పాదం అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

### ఈ నెల 24 నుండి నిర్వహించనున్న పరీక్షలు

### నల్లగొండ జిల్లా ఎస్పీ చందనా దీప్తి



**నల్లగొండ జిల్లా ప్రతినిధి. మే 22. (క్విక్ టుడే ) :** ఈనెల 24 నుండి జూన్ 3 వరకు ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు జరగనుండగా, మధ్యాహ్నం 2:30 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు ఇంటర్మీడియట్ సెకండియర్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా యస్.పి చందన దీప్తి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షా కేంద్రాల సమీపంలో ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్స్,ఇంటర్ నెట్ సెంటర్స్, అన్ని మూసి వేయాలని ఆదేశించారు. పరీక్షా సెంటర్స్ వద్ద నుండి 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడ వద్దు అని ఎలాంటి సభలు సమావేశాలు నిర్వహించ కూడదు అని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పరీక్ష నిర్వహణకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందనీ తెలిపారు.

## అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలి

### ఎమ్మార్వో కు వినతిపత్రం ఇచ్చిన బీజేపీ నాయకులు



**చెన్నూర్,మే 22. క్విక్ టుడే న్యూస్ :** మంచిర్యాల జిల్లా బీజేపీ పార్టీ అధ్యక్షుడు వేరబెల్లి రగునాథ్ రావు జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్,పెద్దపెల్లి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనువాస్ ఆదేశాల మేరకు జైపూర్ మండల బీజేపీ అధ్యక్షుడు దుగుట రాజుకుమార్ ఆధ్వర్యంలో వడ్ల సెంటర్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేపట్టాలని అకాల వర్షాలకు తడిసి మోలుకలెత్తడంతో పండించిన పంట వర్షం పడి నష్ట పోతున్నాం అని రైతన్నల గోడు వెళ్లబోస్తున్నారు త్వరితగతిన రైసు మిల్లర్లతో మాట్లాడి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఒక ప్రణాళిక లేక ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టు ప్రభుత్వం వ్యవరిస్తుంది అలాగే ఒక సన్న రకం వడ్లకు 500 బోనస్ ప్రకటించిన ప్రభుత్వం దొడ్డు రకం వడ్లకు కూడా 500 రూపాయల బోనస్ ఇచ్చి ఆదుకోవాలని కోరారు.ఎమ్మార్వో గారికి వినతి పత్రం అందజేసిన జైపూర్ మండల బీజేపీ పార్టీ అధ్యక్షుడు దుగుట రాజుకుమార్,ఈ కార్యక్రమం లో జైపూర్ మండల ఓబీసీ అధ్యక్షుడు వేముల తిరుపతి గౌడ్ పార్టీ సీనియర్ నాయకుడు రాజేశ్వరరావు,జైపూర్ మండల బీజేవైఎం అధ్యక్షుడు పల్లి కొండ వెంకటేష్,జనరల్ సెక్రెటరీ ఆకు దారి కుమారస్వామి,సెగ్గం సంతోష్,మునిధర్ రెడ్డి,ప్యాగ మొగిలి,విజయ్,తన్ని రాజన్న,లాటుకూరి రవితేజ,సాయికుమార్,రమేష్,జైపూర్ మండల బీజేపీ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నల్లగొండ పట్టణంలో డీకే అరుణ విస్తృత ప్రచారం





**నల్లగొండ జిల్లా ప్రతినిధి.మే 22.( క్విక్ టుడే ) :** నల్లగొండ వరంగల్ ఖమ్మం పట్టభద్రుల ఎన్నికల ప్రచారం లో భాగంగా బుధవారం బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ నల్లగొండ పట్టణ కేంద్రం లోని జిల్లా గ్రంథాలయం, మునిసిపాలిటీ కార్యలయం,జిల్లా పరిషత్ ,రిజిస్ట్రేషన్ కార్యాలయం,ప్రగతి కాలేజ్ ,గౌతమి కాలేజ్ లలో పర్యటించి బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ఒకటో నెంబర్ కు ప్రాధాన్యత ఇచ్చి గెలిపించాలని ప్రచారం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగమూరిషత్ రెడ్డి ఇన్చార్జ్ సుభాష్ జాతీయ నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరెల్లి చంద్రశేఖర్ కన్మంత రెడ్డి శ్రీదేవి రెడ్డి పార్లమెంట్ కో కన్వీనర్ పిల్లి రామరాజు మెదక్ పార్లమెంట్ ప్రబారి బస్వాపురం లక్ష్మీనారాయణ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతేపాక లింగస్వామి జిల్లా కౌన్సిలర్లు బుజ్జ నాగరాజు కంకణాల నాగిరెడ్డి మహిళా మోర్చా అధ్యక్షురాలు రావేల్లి కాశమ్మ ఆవుల మధు సుధాకర్ రెడ్డి శాంతి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్నకు మద్దతుగా తుంగతుర్తి రవి ప్రచారం





**పీర్జాదిగూడ, క్విక్ టుడే న్యూస్ :** ఉమ్మడి వరంగల్,ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకి మద్దతుగా పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి ప్రచారం జోరుగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి తీన్మార్ మల్లన్నకు మద్దతుగా తిరుమలగిరి మరియు మండల పరిధిలో ని వెలిశాల, గుండెపురి, మద్దిరాల మండలం లోని గోరంట్ల, చేవ్లా తండా గ్రామాల లో సహా తుంగతుర్తి మండలం దేవుని గుడి తాండ, పలు గ్రామాలలో ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గారికి మద్దతుగా ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ నగర మహిళా అధ్యక్షురాలు శ్రీలత భద్రునాయక్, ఎంపీటీసీ జుమ్మిలాల్ నాయక్, అంబేద్కర్,వెలిశాల గ్రామ అధ్యక్షులు అశోక్, గుండెపురి గ్రామ అధ్యక్షులు బాలకృష్ణ, గోరంట్ల గ్రామ అధ్యక్షులు కంట్లం,చేవ్లా తండా గ్రామ అధ్యక్షులు సీతారాములు, గుడి తండా అధ్యక్షులు జైపాల్ మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గ్రామ శాఖ నాయకులు పాల్గొన్నారు.

# కేంద్ర,రాష్ట్ర సంబంధాలు బలపడాలి

## - ఉమ్మడి ఎజెండాతో ముందుకు సాగాలి - కొత్తగా ఏర్పడబోయే ప్రభుత్వంపై కీలక బాధ్యతలు

**న్యూఢిల్లీ:** పార్టీలు వేరయినంత మాత్రాన దేశం వేరు కాదన్న విషయం ఆయా రాష్ట్రాల సిఎంలు గమనించాలి. ఐదుదశల పోలింగ్ ముగిసింది. మరో రెండు దశలు మిగిలి ఉన్నాయి. కేంద్రంలో ఎవరు ప్రభుత్వం ఏర్పాటు చేయబోయేది జూన్ నాలుగును తేలనుంది. కొత్తగా అధికారంలోకి వచ్చే ప్రబుత్వం దేశహితం కోసం వేగంగా అడుగులు వేయాల్సి ఉంది. రాష్ట్రల్లో ఏ పార్టీ ప్రభుత్వం ఉన్నా కలుపుకుని పోవాలి. అభివృద్ధి విషయంలో ఉమ్మడి జట్టుగా పోరాడాలి. అలాగే కేంద్ర రాష్ట్రాల మధ్య ఉన్న అధికారిక సంబంధాలు వేరు. కేంద్రం కూడా పెద్దతరహాలో రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకోవాలి.

అప్పుడే కేంద్ర రాష్ట్రాల మధ్య బంధం బలోపేతం అవుతుంది. నీతి ఆయోగ్ ఏర్పాటు సందర్భంగా ప్రధాని మోడీ కూడా కేంద్ర రాష్ట్ర సంబంధాలపై కొత్త నిర్వచనం ఇచ్చారు. కానీ మోడీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అందుకే కొత్తగా ఏర్పడే ప్రభుత్వం రాష్ట్రాలకు నిధుల కేటాయింపు మొదలు, అభివృద్ధి పనులు కూడా పరస్పర విశ్వాసంతో కొనసాగించాల్సి ఉంటుంది. . రాష్ట్రాలు తప్పుదోవ పడుతున్న సందర్భంలో అవసరమైన హెచ్చరికలు కూడా చేయాలి. ఇదే సందర్భంలో తాజాగా మారిన రాజకీయాల క్రమంలో ఆయా రాష్ట్రాల ఆర్థిక స్తితిపైనా నీతి ఆయోగ్ ద్వారా హెచ్చరికలు చేయడం మంచిదే. ఇకపోతే సిఎంలుగా ప్రతి ఒక్కరూ ప్రధానితో నిరంతరం సమీక్షించుకునే అవకాశాలు ఉండాలి. కనీసం ఒక్కో రాష్ట్రానికి ప్రధాని నెలలో ఒకరోజయినా సమయం కేటాయించి రాష్ట్రాల బాగోగులు, సమస్యలు చర్చించాలి. నీతి ఆయోగ్ సమావేశలను కూడా కనీసం మూడు నెలలకో మారయినా సమావేశ పరచి చర్చిస్తే మంచిది. ధాన్యం సేకరణ, నదీజలాల కేటాయింపు సమస్యలు,విద్యుత్ సమస్యలు, ప్రభుత్వరంగ సంస్థల అమ్మకాలు వంటివి ఏవైనా రాష్ట్రాలతో చర్చించాలి. వాటిని విశ్వాసంలోకి తీసుకోవాలి. ఈ విషయంలో కేంద్ర రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు పెరగాలి. రేవంత్ కావచ్చు..జగన్ కావచ్చు.. మమతా బెనర్జీ కావచ్చు.. లేదా మరే ఇతర రాష్ట్ర సిఎం అయినా కావచ్చు పాలనాపరమైన విషయాల కోసం కేంద్రంతో నిత్యం సంబంధాలు నెరపాల్సిందే. ఎవరైనా కేంద్రంతో నిరంతరాయంగా అనుసంధానం అవుతూనే ఉండాలి. ఫెడరల్ వ్యవస్థలో సిఎంలు ప్రధానిని ,కేంద్ర మంత్రులను, కేంద్ర అధికారులను కలవడం సర్వసాధారణం. ఇది విమర్శించే రాజకీయ పార్టీలు గుర్తించాలి. ఇదే సందర్భంలో కేంద్ర రాష్ట్రాల మధ్య పన్నుల విధానంలో పారదర్శకత ఉండాలి. జిఎస్టీ విషయంలో ప్రధానంగా చర్చించాలి. ఏయే రంగగాలు కదులేవుతున్నదీ చర్చించాలి. రాష్ట్రాల అభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందగలదన్న విశ్వాసంతో కేంద్రం ముందుకు సాగాలి. అవినీతి విషయంలో కూడా ఎవరు చేసినా చట్టబద్ధంగా శిక్షకు గురి కావాల్సిందే.

ఇందులో బెదిరింపు రాజకీయాలకు తావుండరాదు. ఇకపోతే పలు పెండింగ్ ప్రాజెక్టులు, జిఎస్టీ నిధుల విడుదలకు సంబంధించి కేంద్రంతో సమస్యలు ఉండనే ఉన్నాయి. ఇవన్నీ కూడా పరిష్కరించుకోవడం సిఎంల కర్తవ్యం. ఇవన్నీ చక్కబెట్టుకోవడం కోసం ఢిల్లీకి వెళ్లాల్సిందే. కేంద్ర రాష్ట్ర సంబంధాలు వేరు..రాజకీయ పోరాటాలు వేరని గుర్తించాలి. రాష్ట్రాలకు సంబంధించి అనేక సమస్యలను ఎప్పుడూ నిలదీయడంలోనూ వెనకడుగు వేయరాదు. అలాగే కేంద్రం కూడా పెద్దన్న పాత్ర పోషించాలే తప్ప నిరంతరరం రాజకీయాం చేయడం సరికాదు.

# టాలీవుడ్‌లో రేవ్ పార్టీ కలకలం

**- తెలుగు నటి హేమ పాల్గొన్నట్లు ఆధారాలు - బెంగళూరు సిటీ కమిషనర్ దయానంద్ వెల్లడి - డ్రగ్స్ నిర్మూలనలో కఠినంగా వ్యవహరిస్తామన్న మంత్రి**

**- బెంగళూరు రేవ్ పార్టీతో హైదరాబాద్ పోలీసుల అప్రమత్తం - ఫామ్‌హౌజ్ ఓనర్లకుహెచ్చరికలు జారీచేసిన పోలీసులు**



**బెంగళూరు:** రేవ్ పార్టీ టాలీవుడ్‌లో కలకలం సృష్టిస్తోంది. నగర శివారులో నిర్వహించిన రేవ్ పార్టీలో తెలుగు నటి హేమ పాల్గొన్నట్లు బెంగళూరు సిటీ కమిషనర్ దయానంద్ స్పష్టం చేశారు. ఆమె సోమవారం విడుదల చేసిన వీడియో ఎక్కడి నుంచి తీశారో విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. ఈ ఈవెంట్‌లో పాల్గొనడానికి పెద్ద మొత్తంలో ఫీజు వసూలు చేశారని.. దాదాపు వంద మంది పాల్గొన్నట్లు ఆయన చెప్పారు. ప్రజా ప్రతినిధులెవరూ పాల్గొనలేదని కమిషనర్ వెల్లడించారు. 'సన్ సెట్ టు సన్ రైస్ విక్టరీ' పేరుతో నిర్వహించిన ఈ పార్టీలో పాల్గొన్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై కర్ణాటక హోంమంత్రి జి.పరమేశ్వర స్పందించారు. 'రేవ్‌పార్టీలో కోట్ల రూపాయల విలువైన కొకైన్, గంజాయి స్వాధీనం చేసుకున్నాం. రాష్ట్రాన్ని డ్రగ్స్‌ఫ్రీగా మార్చాలని చేసే ప్రయత్నాలు ఇతర రాష్ట్రాల డ్రగ్స్ పెడ్లర్ల వల్ల విఫలమవుతున్నాయి. ఈ కేసులో అరెస్ట్ చేసిన వారి నుంచి మరిన్ని వివరాలు సేకరిస్తాం' అని తెలిపారు.

బెంగుళూరు శివారులో ఓ వ్యాపారవేత్తకు చెందిన ఫామ్ హౌస్‌లో నిర్వహించిన రేవ్ పార్టీలో పలువురు తెలుగు టీవీ నటీనటులు, మోడళ్లు పట్టుబడిన విషయం తెలిసిందే. ఆ పార్టీలో తాను లేనని తెలుపుతూ హేమ ఓ వీడియో విడుదల చేశారు. తాను హైదరాబాద్‌లోనే ఉన్నానని.. తనపై వస్తోన్న వార్తలను నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. అయితే రేవ్ పార్టీలో పోలీసులు సంపాదించిన ఫోటోలోని డ్రెస్, వీడియోలని డ్రెస్ ఒకటే కావడంతో అనుమానాలు బలపడ్డాయి. ఇదిలావుంటే బెంగళూరు శివారులో రేవ్ పార్టీ ఉదంతం హైదరాబాద్‌లో ప్రకంపనలు రేపుతోంది. నగర శివార్లలోని ఫాంహౌస్‌లలో తరచూ డ్రగ్స్ పట్టుబడడంతో పోలీసులు కఠిన చర్యలకు దిగారు. రేవ్ పార్టీలు, అసాంఘిక కార్యక్రమాలకు అవకాశం లేకుండా నిఘా ఉంచారు. ఫాంహౌస్‌ల యజమానులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాల రవాణా, విక్రయాలపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో డ్రగ్స్ పార్టీ కేసులో సినీ పరిశ్రమ సహా వివిధ రంగాల ప్రముఖుల పేర్లు బయటకు వచ్చాయి. ఈ పార్టీ వెనుక లింకుల్ని ఛేదించగా గోవా జైలులో ఉండే డ్రగ్స్ స్మగ్లర్ల పేర్లు బయటకొచ్చాయి. అంతకు ముందు టీఎస్ న్యాబ్ ఆధ్వర్యంలో రాజకీయ, సినీ ప్రముఖులపై కేసులు నమోదయ్యాయి. వరుస పరిణామాల దృష్ట్యా రేవ్ పార్టీని హైదరాబాద్‌లో కాకుండా బెంగళూరులో నిర్వహించినట్లు నగర పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రూ.50 లక్షల వ్యయంతో ఈ పార్టీ నిర్వహించిన వాసు నేపథ్యం, అతడి సంబంధాలపై దృష్టి సారించారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి: రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు, ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ పి. గోపీ

**వరంగల్ మే 2024** ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే మిల్లులకు తరలించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు, ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ పి. గోపీ అధికారులను ఆదేశించారు. మంగళవారం వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద వ్యవసాయ మార్కెట్ కమిటీ ఐకెపి
ధాన్య కొనుగోలు కేంద్రాన్ని ఆయన సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ధాన్యం కొనుగోలు గురించి రైతులతో నేరుగా మాట్లాడారు. జూన్ మొదటి వారంలోగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందశాతం కొనుగోళ్లు పూర్తి కావాలని,
ఎక్కడ రైతులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని, సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తూ ధాన్యం అమ్మిన రైతులకు సత్వరమే డబ్బులు అందేలా చూడాలన్నారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా అందుబాటులో ఉంచుకోవాలని, అలాగే ప్రభుత్వం నిర్దేశించిన కస్టం మిల్లింగ్ రైస్ డెలివరీ తొందరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈప్రక్రియ దాదాపు వందశాతం పూర్తయ్యే లా అదనపు కలెక్టర్లు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు.
14158.80 క్వింటాళ్ల ధాన్యం సేకరించి రైస్ మిల్లులకు తరలించడం జరిగిందని ,అదేవిధంగా ఖరీఫ్ 2023-24 లో 14992 క్వింటాళ్ల ధాన్యం 275 మంది రైతుల నుండి సేకరించి 3.28 కోట్ల రూపాయలు చెల్లించామని అధికారులు వివరించారు.



ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ కౌసల్య దేవి జిల్లా వ్యవసాయ అధికారి ఉషా దయల్, జిల్లా పౌరసరఫరాల అధికారి శివ ప్రసాద్ రెడ్డి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ సంధ్యా రాణి, సహాయ పౌరసరఫరాల అధికారి షా ఫైసల్,
సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రగీతం సిద్ధం

**- అందెశ్రీ రాసిన గీతంలో స్వల్ప మార్పులు - సంగీత దర్శకుడు కీరవాణి కంపోజ్**

**- జూన్2న దశాబ్ది ఉత్సవాల్లో ఆవిష్కరణ - గీతాన్ని విని ఓకే చెప్పిన సిఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర గీతంపై ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసింది. ప్రముఖ కవి అందెశ్రీ రాసిన గీతాన్ని స్వల్ప మార్పులతో స్వరపరిచారు. తెలంగాణ అవతరణ జరిగి పదేళ్లు కావస్తున్నందున పదేళ్ల సంబరాల్లో భాగంగా జూన్ 2వ తేదీన ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీతో ఈ గీతాన్ని విడుదల చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రముఖ కవి అందెశ్రీ రాసిన జయ జయహే తెలంగాణ గీతానికి కొన్ని మార్పులు చేశారు. ఒకటిన్నర నిమిషం నిడివిలో ఈ గీతం సిద్ధం అవుతోంది. సినీ సంగీత దర్శకుడు కీరవాణితో ఈ పాటను రేవంత్ ప్రభుత్వం కంపోజింగ్ చేయించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తవుతున్న.. ఇంతవరకు రాష్ట్రం గీతం లేకుండా పోయింది. గతంలో జరిగిన కేబినెట్ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం గీతంపై కీలక నిర్ణయం తీసుకున్నది. ఈ గీతాన్ని రాష్ట్ర గీతంగా తీసుకు రానున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు తెలంగాణకు ప్రత్యేక రాష్ట్ర గీతం ఉండాలని ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. గతంలో అందెశ్రీ రాసిన రాష్ట్ర గీతాన్ని అమోదిస్తూ కేబినెట్ ఓ కీలక నిర్ణయం తీసుకుంది. అయితే తెలంగాణ ఉద్యమం కంటే ముందు ఈ గీతాన్ని రచించారు.

## చిన్న తిరుపతిలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

**ఏలూరు:** ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకా తిరుమల చిన్న వెంకన్న ఆలయంలో వైశాఖ మాస బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా నాల్గవ రోజు మంగళవారం స్వామివారు రామలక్ష్మణ సమేత హనుమాన్ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే హనుమద్వాహనంపై స్వామివారిని ఊరేగించారు. స్వామివారిని దర్శించుకునేందుకు రోడ్లపైకి తరలి వచ్చారు. కాగా రాత్రి 7 గంటలకు ఎదుర్కోలు ఉత్సవం జరగనుంది. అనంతరం వెండి శేష వాహనంపై స్వామివారిని అధికారులు ఊరేగిస్తారు.

ఉత్సవాలలో భాగంగా మూడవ రోజు సోమవారం స్వామివారు కాళీయమర్ధన ఆలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కాగా ద్వారకా తిరుమల శ్రీవారి వైశాఖ మాస దివ్య బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 25వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని ఈవో వేంద్ర త్రినాథరావు తెలిపారు. బ్రహోత్సవాల్లో భాగంగా శ్రీవారి ఆలయ నిత్యకల్యాణ మండప ఆవరణలో విశేష అలంకరణలో అలివేలు మంగ, ఆండాళ్ అమ్మవార్ల కొలువుతీరగా.. నడుమ ఉన్న చిన్నతిరుమలేశుడు పెండ్లి కుమారునిగా ముస్తాబయ్యారు. ఉభయదేవేరులు పెండ్లి కుమార్తెలయ్యారు. ఉదయం ఏర్పాటు చేసిన సువర్ణ సింహాసనంపై స్వామి, అమ్మవార్ల కల్యాణమూ ర్తులను ఉంచి ఆలయ అర్చకులు హారతులిచ్చి ఈ తంతును నిర్వహించారు. ఈవో త్రినాథరావు ఆద్యంతం పాల్గొని అర్చకులు, పండితులకు దీక్షా వస్త్రాలను అందచేసి అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

## నర్సింగ్ ఉద్యోగులకు జీతాలు లేవు

**హైదరాబాద్:** కొత్తగా నియమితులైన 4 వేల మంది నర్సింగ్ ఆఫీసర్లకు నాలుగు నెలలుగా జీతాలు లేవని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. అట్టహాసంగా వారికి నియామక పత్రాలు ఇచ్చినా జీతాలు మాత్రం ఇవ్వడం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న జీతాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన 7 వేల మంది నర్సింగ్ ఆఫీసర్ల నియామక ఘనతను తన ఖాతాలో వేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం..నాలుగు నెలలుగా వారికి జీతాలు మాత్రం చెల్లించడం లేదని విమర్శించారు. ఎల్బీ స్టేడియం వేదికగా అట్టహాసంగా నియామక పత్రాలు అందించి గాలికి వదిలేసింది తప్ప, వారి జీత భత్యాల గురించి అస్సలు పట్టించుకోవడం లేదంటూ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ట్వీట్ చేశారు. దీంతో డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో నియమితులైన 4 వేల మంది నర్సింగ్ ఆఫీసర్లకు జీతాలు అందక అష్టకష్టాలు పడుతున్నారని, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నట్లు లేని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పటికైనా వాస్తవాలు గుర్తించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల జీతాలును తక్షణమే చెల్లించాలన్నారు.

## ఉపాధి పనుల్లో విషాదం

**రాజన్న సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. ఉపాధి హామీ పనులు చేస్తుండగా మట్టిపెళ్లలు మీదపడి ఒకరు మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషాదకర సంఘటన కోనారావుపేట మండటం వెంకట్రావుపేటలో చోటు చేసుకుంది. ప్రమాదంలో మార్వాక రాజవ్వ (45) మృతి చెందగా కర్ణాల లహరి, పల్లం దేవవ్వ, కర్నాల శ్యామల, ఎడ్ల రామవ్వ, వద్నాల అమృత, సందు చంద్రయ్య గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను హుటాహుటిన జిల్లా హాస్పిటల్‌కు తరలించారు. కాగా, విషయం తెలుసుకున్న జడ్పీ చైర్ పర్సన్ జడ్పీ చైర్పర్సన్ న్యాలకొండ అరుణరాఘవ రెడ్డి హాస్పిటల్‌కు వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

## ఆస్పత్రి ఆవరణలో విరిగిపడ్డ చెట్టు

**హైదరాబాద్:** బొల్లారం కంటోన్మెంట్ ఆసుపత్రిలో దారుణం జరిగింది. కంటోన్మెంట్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం వచ్చిన దంపతులపై ఆస్పత్రి ఆవరణలో ఉన్న భారీ వృక్షం విరిగి పడింది. ఈ ప్రమాదంలో భర్త రవీందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలోభార్య సరళ దేవికి సైతం తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిగా మెరుగైన చికిత్స కోసం అంబులెన్స్ లో గాంధీ ఆస్పత్రికి తరలించారు.సరళ దేవి ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నట్లు గుర్తించారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం గాంధీ ఆసుపత్రికి తరలించారు.పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని తెలిపారు. ఈ ఘటన మూలంగా ఆసుపత్రికి వచ్చిన వారంతా ఆందోళన గురయ్యారు.

## తెలంగాణ డిజిపి ఫోటోతో కేటుగాళ్ల మోసం

**హైదరాబాద్:** తెలంగాణ డీజీపీ ఫొటోతో కేటుగాళ్లు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. వాట్సప్ డీపీగా డీజీపీ రవిగుప్తా ఫొటో పెట్టి మోసాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ వ్యాపారవేత్తకు, ఆయన కుమార్తెకు వాట్సప్ కాల్స్ చేసి బెదిరింపులకు పాల్పడ్డారు. డ్రగ్స్ కేసులో అరెస్టు చేస్తామని తెలిపారు. కేసు నుంచి తప్పించుకునేందుకు రూ. 50 వేలు డిమాండ్ చేశారు. దీంతో అనుమానం వచ్చిన వ్యాపారవేత్త సీపీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు పాకిస్తాన్ కోడ్ ?92తో వాట్సప్ కాల్ వచ్చినట్లు గుర్తించారు.

## బోనస్ పథకం..బోగస్

**హైదరాబాద్ :** కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు.. రైతు వ్యతిరేక పాలన అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్(ట్విటర్) వేదికగా విమర్శించారు. ప్రచారంలో ప్రతిగింజకు బోనస్ అని ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే అంటారా? అని ప్రశ్నించారు. ఇది కపట కాంగ్రెస్ మార్కు మోసం, దగా, నయవంచన అన్నారు. నీరివ్వరు.. కరెంట్ ఇవ్వరు.. పంట కూడా సరిగా కొనుగోలు చేయరా? అని నిలదీశారు. రూ.15 వేలు రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఏం అయ్యాయన్నారు. నమ్మి ఓట్లేస్తే గొంతు కోస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. ప్లలెప్లలెనా ప్రశ్నిస్తారు.. రైతన్నలతో కాంగ్రెస్ కౌంట్‌డౌన్ మొదలైందని పేర్కొన్నారు. ఆ పార్టీది ఓట్ల నాడు ఓ ముచ్చట.. నాట్లనాడు ఓ ముచ్చట అని ఎద్దేవా చేశారు.

## పల్నాడులో పక్కాగా హింసకు ప్లాన్

**న్యూఢిల్లీ :** పల్నాడులో హింసకు ముందునుంచీ వైసిపి ప్రణాళికలతో ఉందని తెదేపా సీనియర్ నేత కనకమేడల రవీంద్రకుమార్ ఆరోపించారు. గత ఘటనలు ముందేసుకుంటే వారి నైజం బయటపడుతుందన్నారు. గతంలో మాచర్లలో నడిరోడ్డుపై తెదేపా కార్యకర్త గొంతుకోసి చంపారని రవీంద్రకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎన్నికలకు ముందే 100 హింసాత్మక ఘటనలు జరిగాయని మండిపడ్డారు. గత రెండేళ్లుగా మాచర్లలో వైకాపా హింస కొనసాగుతున్నా.. పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. తప్పనిసరి కేసులు నమోదు చేయాల్సి వస్తే నామమాత్రపు కేసులు పెట్టారని ఆక్షేపించారు.

# ఎన్నికల్లో చెమటోడుస్తున్న కాంగ్రెస్



మరోమారు అధికారం దక్కించుకునే క్రమంలో ప్రధాని మోడీ వేస్తున్న ఎత్తులకు కాంగ్రెస్ పై ఎత్తులు వేస్తోంది. ఇండియా కూటమి జోరుగా ప్రచారం చేస్తోంది. ప్రాంతీయ పార్టీలను కలుపుకోవడమే గాకుండా వారి కోసం కాంగ్రెస్ మెజార్టీ సీట్లను కూడా వదులుకుంది. ఐదు దశల పోలింగ్ ముగిసింది. మరో రెండు దశల్లో జూన్1తో పోలింగ్ ముగియనుంది. 4న ఫలితాలు వెల్లడి కానున్నాయి. అయితే గతంలో ఎప్పుడూ లేనంతగా కాంగ్రెస్ చెమటోడుస్తోంది. మాదే అధికారం అని ప్రచారం చేసుకుంటోంది. బిజెపి కేవలవం 180 సీట్లకే పరిమితం అవుతుందని ప్రచారం చేస్తోంది. కులగణన, పేదింటి మహిళల ఖాతాల్లో లక్ష నగదు జమవంటి ఆకర్శక పథకాలను ప్రస్తావిస్తోంది. అలాగే అధికారమే లక్ష్యంగా సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు, అన్నా చెల్లెళ్లు అయిన రాహుల్, ప్రియాంకలు దేశమంతా చుట్టి వస్తున్నారు. పాత కాంగ్రెస్ తరహాలో ఎన్నికల ప్రచార భారాన్ని భుజాన వేసుకున్నారు. మోడీ, అమిత్ షాలకు ధీటుగా ప్రచారం చేపట్టారు. విమర్శలకు ప్రతి విమర్శలు చేస్తున్నారు. తడబాటు లేకుండా ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో బిజెపి, మోడీ, అమిత్ షాలు కూడా కాంగ్రెస్‌ను ప్రధాన ప్రతిపక్షంగా అంగీకరించి ఎదురుదాడికి దిగుతున్నారు. ఓ రకంగా చెప్పాలంటే ఇది వారికి తొలి విజయంగానే గుర్తించాలి. కర్నాటక, తెలంగాణల్లో అధిరకారం దక్కించుకోవడంతో కాంగ్రెస్‌లో భరోసా పెరిగింది. రాహుల్ నాయకత్వంపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల్లో కొంత నమ్మిక ఏర్పడింది. భాగస్వామ్య పక్షాలు కూడా రాహుల్‌ను అంగీకరిస్తున్నారు. కాంగ్రెస్ శ్రేణులు భావి ప్రధానిగా భావిస్తున్నారు. తమ తదుపరి ప్రధాని రాహుల్ అంటూ ఆయా రాష్ట్రాల్లో కాంగ్రెస్ శ్రేణులు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇకపోతే బిజెపిలో కూడా మోడీ తీరుపై అంతర్గతంగా తీవ్ర వ్యతిరేకత ఉంది. మోడీ,అమిత్‌షాలు పార్టీని తమగుప్పిట్లో పెట్టుకుని ఆడిందే ఆటగా సాగిస్తున్నారన్న ఆందోళన నెలకొంది. విపక్షాలు లేవనెత్తే అంవాలపై ప్రధాని మోడీ నేరుగా సమాధానం ఇవ్వడం లేదు. ఇంతకాలం కేవలం ప్రచారానికి మాత్రమే పరిమితం అయిన ప్రియాంకను ఇక నేరుగా ప్రతక్ష్యక్ష రాజకీయాల్లోకి దింపడం ద్వారా మోడీని ఢీకొనాలని రాహుల్ ఎత్తుగడ వేశారు. ప్రియాంక గాంధీ ఎప్పటికైనా రాజకీయాల్లోకి వస్తారా, రారా? అన్న ప్రశ్న మెదులుతూనే ఉంది. కొడుకు కోసం సోనియా అడ్డుపడుతున్నదన్న ప్రశ్నలు ఇంతకాలం వేధిస్తూ వచ్చాయి. అచ్చం ఇందిరమ్మలాగా ఉండే ప్రియాంక వస్తేనే కాంగ్రెస్ బతికిబట్టకట్టడం సాధ్యమని భావిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు అధికంగా ఉన్నారు. అయితే ప్రచారంలోకి దిగినా ఆమె ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నారు. రాహుల్‌కు పోటీగా ఉండకుండా అన్నకే మద్దతుతో ప్రచారం చేస్తున్నారు.రాయబరేలిలో కూడా పోటీకి దూరంగా ఉన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో మోదీని ఓడించడం సాధ్యం కాధన్న భావనలో కాంగ్రెస్ నేతలు ఉన్నారు. ఈ దశలో ఇక ప్రియాంక మాత్రమే కాంగ్రెస్‌ను బతికిస్తుందని అని ఇంతకాలం నమ్ముకున్న కాంగ్రెస్ అభిమానులకు ప్రియాంక రాజకీయరంగ ప్రవేశం, ప్రచారం రెట్టించిన ఉత్సాహాన్ని నింపింది. ఇంతకాలం కుటుంబపరంగా అమ్మ, అన్నల విజయం కోసం అమేథీలోనూ, రాయ్‌బెరిల్లీలోనూ ప్రచారం చేస్తూ వచ్చిన ప్రియాంక, పార్టీ కోసం పనిచేయలేదు. ప్రియాంక ఇప్పుడు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ హోదాలో దేశవ్యాప్తంగా ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇది మోదీపై రాహుల్ సర్జికల్ దాడి అనీ, రాజకీయ బ్రహ్మాస్త్రమనీ చాలామంది భావిస్తున్నారు. ప్రియాంకను పూర్తిస్థాయిలో తెరమీదకు తేవడంతో బీజేపీ వణికిపోతున్నదని రాహుల్ కూడా అంటున్నారు.మొత్తంగా రాజకీయ ఎత్తుగడలు సాగుతున్నాయనే చెప్పాలి. ప్రియాంక ప్రభావం దేశమంతటా కాంగ్రెస్ పునరుజ్జీవనానికి ఉపకరిస్తుందని కాంగ్రెస్ నాయకులు సంతోషిస్తున్నారు. సార్వత్రక ఎన్నికల్లో హస్తినలో పాగా వేయాలంటే 80స్థానాలున్న యూపీ అత్యంత కీలకం. పార్టీ యావత్తూ నిస్తేజంగా, నిరాసక్తం గా ఉన్న ఈ స్థితిలో ప్రియాంక ప్రవేశం పార్టీ శ్రేణులకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. మోదీ హవాతో యూపీలో బీజేపీ పరిస్థితి ఒక్కసారిగా మారినట్టు, ప్రియాంక రాక కాంగ్రెస్‌ను విజయ తీరాలకు చేరుస్తుం దని ఆశిస్తున్నారు. యోగి సహా కేంద్రక్యాబినెట్‌లోని అనేకమంది మంత్రులు గెలుచుకొస్తున్న తూర్పు యూపీని స్వాధీనం చేసుకోవడం, తద్వారా బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశాలను దెబ్బతీయడం కాంగ్రెస్ ప్రధాన లక్ష్యం. సగం స్థానాలున్న తూర్పు ప్రాంతంలో ఒకప్పుడు కాంగ్రెస్ పక్షాన నిలిచి, ఇప్పుడు బీజేపీ ఓటుబ్యాంకుగా మారిన అగ్రకులాలవారిని తిరిగి మెప్పించి రప్పించే బాధ్యత ప్రియాంక తీసుకున్నారు. అయితే ప్రియాంకను పూర్తిస్థాయిలో రాజకీయంగా దింపితే తప్ప బ్రహాస్త్రంగా ప్రయోగిం చడం సాధ్యం కాదని కాంగ్రెస్ శ్రేణులు అభిప్రాయ పడుతున్నాయి. ప్రస్తుత ప్రచారంతో ఆమె ఏ మేరకు కాంగ్రెస్‌కు తురుపుముక్కగా పనికి వస్తారన్నది ఎన్నికల ప్రచారం, సరళి, ఫలితాలను బట్టి తేటతెల్లం కానుంది. యూపీలో చెప్పుకోదగ్గ నాయకత్వం లేని కాంగ్రెస్‌కు ఇప్పుడు ప్రియాంక రాకతో ఆ కొరత మాత్ర తీరుతుంది. అయితే మోడీ, అమిత్ షా వేస్తున్న ఎత్తుల ముందు కాంగ్రెస్ ఏ మేరకు నిలబడుతుందన్నదే ప్రశ్న. మరో రెండు దశల్లో జరుగున్న ఎన్నికల తరవాత విజేత ఎవరన్నది తేలనుంది. ఎవరు ఎంతగా ప్రచారం చేసి, ప్రజలను దగ్గరుకు చేర్చుకున్నారో తెలియనుంది.

# పాలకులకు ఆర్థిక క్రమశిక్షణ ముఖ్యం!

## అభివృద్ధి కేంద్రంగా పథక రచన చేయాలి

**హైదరాబాద్:** రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలు ఆర్థిక క్రమశిక్షణతో పాటు,రాజకీయ క్రమశిక్షణ కూడా పాటించకుంటే మట్టి కరచిపోతాయని గతంలో అనేక సందర్భాల్లో చూశాం. గుదిబండగా మారిన పథకాలకు మంగళం పాడాలి. నితరంతరాయంగా డబ్బుల పందేరంతో ఓట్లు పొందాలన్న పథకాలను ఇక ఎంతమాత్రం కొనసాగించరాదు. ఈ డబ్బుల పందేరాన్ని అభివృద్ధిగా చూపి ప్రచారం చేసుకోవడం కూడా సరికాదు. అప్పుల భారం పెరుగుతున్న క్రమంలో ఉచితపథకాలను తగ్గించుకోవడం ద్వారా ప్రజలపై భారం పడకుండా చూడాలి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రూపాయికే కిలో బియ్యం పథకం గుదిబండగా మారింది. ఇప్పుడు ధరలను పెంచాల్సిన అవసరం ఉంది. అలాగే జనాభాను మించి తెల్లకార్డులు ఉన్నాయి. వీటిని సమీక్షించాలి. బియ్యం ధరలు కనీసం పదిగా నిర్ణయించాలి. ఇది ఎపికి కూడా వర్తిస్తుంది. కుటుంబ సర్వే ప్రకారం అర్హుల జాబితాను గుర్తించాలి. అలాగే రైతుబంధు జాబితాను కూడా మళ్లీ సమీక్షించాలి. బడాభూములున్న వారికి, తోటలు, బంజరు భూములున్న వారికి రైతుబంధు సాయం అందకుండా చూడాలి. పథకాలతో ప్రజలను మచ్చిక చేసుకోవచ్చేమో కానీ అదే అభివృద్ధి అని నమ్మించడం సరికాదు. తాగు,సాగునీటితో పాటు, విద్యుత్, రోడ్డు వసతులను సంపూర్ణంగా అభివృద్ధి చేయాలి. విద్యావైద్య రంగాలకు కేటాయింపులు పెంచి వసతులను మెరుగు పరచాలి. నిరుద్యోగ సమస్య మొత్తంగా పరిష్కరించకున్నా ఉపాధి అవకాశాలను పెంచాలి. రాజకీయాలు వేరు..అభివృద్ధి వేరు.. ఈ రెంటిని అనుసంధానిస్తూ ముందుకు సాగాలి. రాజకీయాల్లో ఏ పార్టీ అయినా హుందాగా ఉండాలి. రాజకీయాల్లో వ్యక్తిగత విద్వేషాలకు తావు ఉంరాదు. ఎపిలో జగన్ ప్రభుత్వం విపక్షాలను అణచివే యడం, కేసులు పెట్టడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. కాంగ్రెస్, టిడిపిలు తెలంగాణలో ఉనికి లేకుండా పోవాలని కెసిఆర్ వేసిన ఎత్తుగడలు ఎదురుతిరిగాయి. బెంగాల్లో కమ్యూనిస్టులు ఇదే ధోరణిలో 30 ఏళ్లపాటు రాజ్యమేలారు. తమకు తిరుగు లేదన్న ధోరణిలో వారు ప్రజల ఆశలను, ఆకాంక్షలను పట్టించు కోలేదు. తమ నిరంకుశ పాలనకు ప్రజాస్వామ్యం, అభివృద్ధి ముసుగేసారు. కానీ అక్కడా మమతా బెనర్జీ కమ్యూనిస్టులను కూకటి వేళ్లతో పెకిలించారు. అయితే ఆమె కూడా అదే ధోరణిలో నిరంకుశ పాలన సాగించడంతో ఇప్పుడు మమతా బెనర్జీ పునాదులు కూడా కదులుతున్నాయి. బిజెపి అక్కడ చేస్తున్న పోరాటానికి ప్రజలు మద్దతు పలుకుతున్నారు. నిరాశా నిస్పృహలతో ఉన్న మమతా బెనర్జీ బిజెపి నేతలపై దాడులకు దిగుతోంది. గత ఎన్నికల్లో గెలిచినా బిజెపి కూడా బలంగానే ఉందని ఉనికిని చాటింది. తెలంగాణల కూడా తొలుత తెలుగుదేశం పార్టీని, ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీని కోలుకోకుండా దెబ్బతీసిన కేసీఆర్, ఇప్పుడు తన ఉనికినే కోల్పోయే ప్రమాదంలో పడ్డారు. కెసిఆర్ అహంకారం వల్ల కాంగ్రెస్, బిజెపిల బలం అనూహ్యంగా పెరగడానికి ప్రధాన కారణం. అధికారం కోల్పోయాక కూడా కేసీఆర్ చిన్నపాటి విమర్శను కూడా స్వీకరించలేని స్థితికి చేరుకున్నారు. జగన్ కూడా అదే ధోరణితో ఉన్నారు. అదే పనిగా పందేరం పథకాలకు పెద్దపీట వేసారు. డబ్బులుపంచడమే అభివృద్ధి అన్న నినాదం ఎత్తుకున్నారు. ఇది ఎంతమాత్రం సరికాదు. మౌళిక సదుపాయాలు కల్పించడం, సౌకర్యాలు కల్పించడం, ప్రజలకు ఉపాధి అవకాశాలు పెంచడం ముఖ్యం కావాలి. అభివృద్ధి నమూనా మారకుంటే రాష్ట్రం అధోగతి పాలుకకాక తప్పదు. ఈ విషయాలను గుర్తించి ప్రాంతీయ పార్టీలు పాలన సాగించాలి. అలాగే ప్రజాస్వామ్యంలో నిరంకుశ విధానాలను ఎవరు అవలంబించినా పతనం తప్పదు. అది గుర్తించకపోతే మనుగడ సాగించడం కూడా అంతే కష్టం. అందుకే రేపటి ఎన్నికల ఫలితాలతో గుణపాఠం నేర్చుకోవాలి.

# సీజనల్ వ్యాధుల నివారణకు ఇదే సమయం

## - పారిశుధ్య నిర్వహణా లోపం రాకుండా చూడాలి - ప్రజల భాగస్వామ్యంతోనే పరిసరాల శుభ్రత సాధ్యం



**విజయవాడ:** వచ్చేది వర్షాకాలం. వర్షాకాలంఓనే సీజనల్ వ్యాధులు ఇబ్బంది పెడుతాయి. ఏటా ఇలాంటి సమ్యలు చూస్తూనే ఉన్నాం. ఈ క్రమంలో ఇప్పటి నుంచే సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలి. వర్షాకాల వ్యాధులపై చైతన్యం చేయాల్సి ఉంది. రాష్ట్రంలో గతంలో ప్రజలు డెంగీ, తదితర వైరల్ జ్వరాలతో ఇబ్బందులు పడేవారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత కొనసాగితే విషజ్వరాలు లేదా, అంటువ్యాధులు ప్రబలవని వైద్యనిపుణులు అంటున్నారు. ప్రతి ఏటా వానాకాలంలో అంటు వ్యాధులు ప్రబలడం సర్వసాధారణంగా మారింది. చలికాంల వచ్చే సరికి స్వైన్ ఫ్లూ లాంటి వ్యాధులు విజృంభిస్తుంటాయి. పట్టణాలు,పల్లెలు అనే తేడా లేకుండా స్వచ్ఛంగా ఉంచాలని పదేపదే ప్రచారం చేస్తున్నా ప్రజలు పట్టించుకోవడం లేదు. ఎవరికి వారు తమకేంటన్న భావనతో అపరిశుభ్రతకు కారణమవు తున్నారు. ముఖ్యంగా దోమల వృద్ధికి అవకాశం ఉన్న ఉన్న నీటి తొట్లు, నీటి నిలువ ప్రదేశాల్లో నీటిని తొలగించే చర్యలు తీసుకోవాలన్నారు. దీంతోపాటు ఇంటి మూలల్లో ఉన్న ఉపయోగంలో లేని వస్తువులను తీసివేసి, దోమల లార్వా వృద్ధికి అవకాశం లేకుండా చేసే చర్యలను చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పారిశుద్ధ్య నిర్వహణ పైన పైన దృష్టి సారించి సీజనల్ వ్యాధుల బారి నుంచి కాపాడుకునే ప్రయత్నం ప్రారంభిం చాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఇళ్ళ ముందు కానీ లేదా ఇంటి లోపల నీటి నిలువ ఉండే ప్రాంతాల్లో నీటిని తొలగించే ప్రయత్నం చేయడం లేదా వాటిపైన నూనెను చల్లడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. దీంతోపాటు ఇళ్లలో ఉన్న పనికిరాని లేదా ఉపయోగం లేని లేని వస్తువులను తొలగించుకోవాలని కోరారు. అప్పుడేసీజనల్ వ్యాధులను రాకుండా నిరోధించగలమని అన్నారు. కాలువల్లో వాడిఎ దేసిన వ్యర్తాలను, ప్లాస్టిక్‌ను పడేయడం వల్ల కూడా మురికినీరు నిలిచి పోతోంది. దీనికి ప్రజలే బాధ్యత వహించాలి. మురుగునీటి పారుదల సక్రమంగా లేకపోవడం వల్ల ఏలూరులో వింతవ్యాధి ప్రజలను తీవ్రంగా భయపెట్టింది. ఇకపోతే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నామని నాయకులు చెపుతున్నా వాస్తవం వేరే రకంగా కనిపిస్తోంది. పారిశుద్ధ్య లేమి కారణంగానే ఇటువంటి వ్యాధులు ప్రబలుతున్న విషయం సుస్పష్టం.ఈక్రమంలో ప్రజలు పురపాలకసంస్థపై ధ్వజమెత్తుతున్నారు. అపరిశుభ్రత కారణంగా దోమలు విజృంభించడం, వింతవ్యాధులు విజృంభించడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నది. సీజనల్ వ్యాధుల నివారణ ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని అధికారులు అభిప్రాయ పడ్డారు. బహిరంగ ప్రదేశాలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీలు దోమల నివారణతో పాటుగా పారిశుద్ధ్య నిర్వహణ చేసేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు.

## ఐటి ఉద్యోగిని అరెస్ట్ చేసిన ఎన్ఐఎ

**అనంతపురం:** అనంతపురం జిల్లా రాయదుర్గం పట్టణంలోని ఆత్మకూర్ వీధికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ ఇంట్లో ఎన్ఐఏ అధికారులు సోదాలు చేశారు. ఆయన కుమారుడు సోహెల్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడు బెంగళూరులోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. సోహెల్ ఎస్‌బీఐ ఖాతాకు ఇటీవల అధిక మొత్తంలో నగదు జమ కావడంతో అతడి కుటుంబ సభ్యులను విచారించారు. అనంతరం యువకుడిని రాయదుర్గం పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఉగ్రవాదులతో సంబంధాలపై విచారిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## రాష్ట్రవ్యాప్తంగా చల్లబడ్డ వాతావరణం



**హైదరాబాద్** రాష్ట్ర వ్యాప్తంగా వాతావరణం చల్లబడింది. భారీ ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం కలిగింది. గత రెండు రోజుల నుంచి రాష్ట్రంలోని ఆయా జిల్లాల్లో వర్షాలు కురిశాయి. అయితే మరో రెండు రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, ములుగు, హనుమకొండ, వరంగల్ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. గురువారం రోజు నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల్, నారాయణపేట్, సూర్యాపేట, మహబూబ్‌నగర్ జిల్లాలో భారీ వర్షం కురిసింది. రానున్న రెండు రోజుల్లో ఉరుములు, మెరుపులతోపాటు ఈదురుగాలులు వీస్తూ పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వెల్లడించింది. కాగా ద్రోణి కర్ణాటక మీదుగా తమిళనాడు వరకు సముద్ర మట్టం నుంచి విస్తరించిందని వివరించింది. ఆకాశం మేఘావృతమై ఉండనుందని వాతావరణ శాఖ తెలిపింది. నగరంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

## చిత్తవుతున్న ధాన్యం రైతులు

**ఆదిలాబాద్** ఎన్నిచర్యలు తీసుకున్నా,అధికారులు పర్యవేక్షిస్తున్నా రైతుకు దళారుల బెడద తప్పడం లేదు. గత్యంతరం లేని రైతులు మధ్య దళారులకే విక్రయిస్తున్నారు. ధాన్యం అమ్మకాల్లో రైతులు ఏటా సమస్యలు ఎదుర్కొంటున్నా వారిని పట్టించుకోవడం లేదు. అకాల వర్షాలతో పంట దెబ్బతిని దిగుబడి తగ్గిందని ఓ వైపు ఆందోళన చెందుతుంటే మరోవైపు పంట కొనుగోళ్లు లేక కలవరపడుతున్నాడు. నిబంధనల పేరిట ప్రభుత్వరంగ సంస్థలు ఇబ్బంది పెడుతుంటే.. దళారులు ధర తగ్గించి పంట కొనుగోలు చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో జిల్లాల్లో దళారులది ఆడిందే ఆటగా మారింది. మొదట్లో పంట బాగానే ఉన్నా అకాల వర్షాల వల్ల పంట కొంత దెబ్బతింది. కొనుగోలులో అవకతవకలు జరుగకుండా ఉండాలనే ఆలోచనతో రైతులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులను కూడా జారీ చేశారు. మధ్య దళారులు రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముకోకుండా ఉండాలనే ఆలోచనతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయినా తేమశాతం పేరుతో తరుగు తీస్తున్నారు. అయితే అధికారులు నిబంధనలు పెట్టడంతో ఇప్పుడు పల్లెల్లోకి దళారులు వచ్చి నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. ఇందులో కూడా కొందరు తూకంలో మోసానికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పల్లెల్లో ఇలా ఏ గ్రామానికి వెళ్లినా మధ్య దళారులు ఇలా రైతుల ఇంటికి వెళ్లి తక్కువ ధరకే నేరుగాకొనుగోలు చేస్తున్నారు. ఇదంతా జరుగుతున్నా వ్యవసాయాధికారులుగానీ, మార్కెటింగ్ అధికారులుగానీ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

## పంట మార్పిడితోనే మెరుగైన దిగుబడి

**విజయనగరం :** రైతులు పంట మార్పిడి చేసుకోవడం ద్వారా భూసారాన్ని కాపాడు కోవడంతో పాటు, పంటల దిగుబడి పెంచుకోవచ్చని వ్యవసాయాధికారులు తెలిపారు. ఏటా ఒకే పంట వెయ్యడం వలన దిగుబడులు ఆశించిన స్థాయిలో రావడం లేదని తెలిపారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. రైతులు పంట మార్పిడే కాకుండా కనీసం రకాలను మార్చడం లేదన్నారు. చెరకులో నూతన రకాలు ఉన్నాయని వాటిని సాగు చేసుకోవాలని చెప్పారు. విత్తనం నిమిత్తం ప్రత్యేకంగా తోటలు పెంచుకోవాలని వివరించారు. ఆరునెలల వయసు గల చెరకును విత్తనంగా వాడాలని చెప్పారు. చెరకులో బిందు సేద్యం ద్వారా నీరు, ఎరువులు ఇవ్వాలని చెప్పారు. జిల్లాలో ఏటా పూర్తిస్థాయిలో వర్షాలు పడుతున్నా కురుస్తున్న రోజుల సంఖ్య తగ్గిపోతోందన్నారు. ఒకేసారి ఎక్కువ వర్షం పడుతోందని.. ఇదంతా వృథాగా పోతోందని వివరించచారు.

## మద్దతు ధరలకు కొనుగోళ్లు

**భద్రాద్రి కొత్తగూడెం :** గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ధాన్యం దిగుబడిపై అకాల వర్షాల ప్రభావం చూపాయి. అయితే తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరలకు కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీనికి తోడు ధాన్యం మద్దతు ధర కూడా పెరిగినందున రైతులు ఎక్కువ శాతం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్దనే విక్రయాలు జరిపే అవకాశాలు ఉన్నాయి. దళారుల ప్రమేయం లేకుండా రైతులకు అన్ని సౌర్యాలు కల్పించారు. ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేసి రైతులకు సకాలంలో వారి ఖాతాల్లో సొమ్ములను జమ చేశారు.

# సైలెన్సర్లు మార్పు చేస్తే క్రిమినల్ చర్యలు

## - ట్రాఫిక్ ఏసిపి సత్యనారాయణ



**వరంగల్ : మే 22**
ద్విచక్ర వాహనదారులు కంపెనీతో వచ్చిన సైలెన్సర్లను ఎలాంటి మార్పు చేసిన వాహనదారుడితో పాటు మార్పు చేసిన మెకానికిపై క్రిమినల్ చర్యలు తీసుకోబడుతాయని వరంగల్ కమిషనరేట్ ట్రాఫిక్ ఏసిపి సత్యనారాయణ హెచ్చరించారు. ట్రాఫిక్ పోలీసులు బుధవారం సి. పి. ఓ జంక్షన్ వద్ద అధిక శబ్దం చేసే ద్విచక్రవాహన సైలెన్సర్లను రోడ్ రోలర్ తో ధ్వంసం చేసారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అదేశాల మేరకు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాల కంపెనీ సైలెన్సర్ స్థానంలో అధిక శబ్దం వచ్చే సైలెన్సర్ల ఏర్పాటుపై ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఇందులో భాగంగా గత కొద్ది రోజులుగా ట్రై సిటీ పరిధిలో నిర్వహించిన ప్రత్యేక తనీఖీల్లో నిబంధనలు విరుద్ధంగా అధిక శబ్ధం వచ్చే సైలెన్సర్లు ఏర్పాటు చేసిన ద్విచక్రవాహనాలను గుర్తించి వాటి నుండి మార్పు చేసిన సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. ట్రాఫిక్ పోలీసులు తొలగించిన సైలెన్సర్లను మరోమారు వినియోగించకుండా రోడ్ రోలర్ సాయంతో 261కు పైగా సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీసులు ద్వంసం చేసారు. ధ్వంసం చేసిన సైలెన్సర్లలో హనుమకొండకు చెందినవి 73 కాగా కాజీపేట 88, వరంగల్ 100 వున్నాయి.అనంతరం ట్రాఫిక్ ఎసిపి మాట్లాడుతూ సిపి అదేశాల మేరకు నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను మార్పు చేయడం చట్టరిత్యా నేరమని, శబ్ద కాలుష్య నియంత్రణతో పాటు ప్రజాఆరోగ్యాన్ని దృష్టిలో వుంచుకోని అధికంగా శబ్దం చేసే ద్విచక్రవాహనలపై ప్రత్యేక దృష్టి సారించి తనీఖీలు చేపట్టడం. జరిగింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులకు తెలియజేయునది కంపెనీతో వచ్చిన సైలెన్సర్లను మాత్రమే. వినియోగించుకోవాలి, ఎవరైన వాహనదారుడు సైలెన్సర్ మార్పు చేసే వారిపై పోలీసులు తీసులు క్రిమినల్ చర్యలు తీసుకోబడటంతో పాటు అట్టి వాహనదారులకు ఆర్టీఐ గారి ద్వారా 03 నెలలు లైసెన్సు రద్దు చేయడం మరియు అట్టి వాహనాన్ని సీజ్ చేయడం జరుగుతుంది .. అలాగే తమ మెకానిక్లులు కూడా ఎట్టి పరిస్థితిలో ద్విచక్రవాహనాలకు సైలెన్సర్ల మార్పుకు ప్రోత్సహించవద్దని, ఇకపైన సైలెన్సర్ల మార్పుకు సహకరించిన మెకానిక్లపై క్రిమినల్ చర్యలు: తీసుకోబడుతాయని. ఏసిపి తెలియజేసారు.
ఈ కార్యక్రమములో ట్రైనీ ఐపిఎస్ శుభం నాగ్,హనుమకొండ, వరంగల్, కాజీపేట ట్రాఫిక్ ఇన్స్ స్పెక్టర్లు , శ్రీధర్ , షుకూర్ , నాగబాబు తో పాటు ట్రాఫిక్ ఎస్.ఐలు పూర్ణ చంద్ర రెడ్డి, యుగంధర్ ఇతర ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకోవాలి : దబ్బటి శేఖర్



**చౌటుప్పల్ : మే 22,** :సమాచార హక్కు రక్షణ చట్టం -2005 యాదాద్రి భువనగిరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దబ్బటి శేఖర్ మాట్లాడుతూ వరంగల్ ,ఖమ్మం ,నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు మే -27 సోమవారం రోజున జరుగుతున్న సందర్భంగా సమాజంలో అవగాహన ఉన్న వ్యక్తిని నిరుద్యోగుల సమస్యలపై పోరాడే అభ్యర్థిని ఎన్నుకోవాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని వరంగల్ ,ఖమ్మం ,నల్గొండ జిల్లాల పట్టభద్రులకు దబ్బటి శేఖర్ పత్రికా ముఖంగా విజ్ఞప్తి చేశారు.

## రాయపర్తి మండలంలోని పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**వద్దన్నపేట ప్రతినిధి : మే 22,**రాయపర్తి మండలం, జయరాం తండాజయరా తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గూగులోతు శంకర్ నాన మ్మ గుగులోతు మారోని.ఇటీవల కాలంలో మరణించగా, బుధవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి. అనంతరం గట్టికల్ పానిస్ తండాకు చెందిన భూక్య సుమల త.ఇటీవల కాలంలో మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించిన.పాలకుర్తి నియో జ కవర్గ ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి.ఎమ్మెల్యే తో పాటు. తొర్రూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు- జాటోత్ హమ్య నాయక్ .మండల అధ్యక్షులు- ఈదులకంటి రవీందర్ రెడ్డి.మండల యూత్ అధ్యక్షులు.ఎండి మహమూద్ .మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు- ఎండి అఫ్రోజ్ ఖాన్ మరియు స్థానిక నాయకులు, మండల నాయకులు, పాల్గొన్నారు.


## పత్రికా విలేకరిపై దాడి చేసిన దుండగులను శిక్షించాలి





**బెజ్జూర్ మే22,**
కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలో ఆదాబ్ హైదరాబాద్ పత్రిక విలేకర్ అంగల తిరుపతి అనే విలేకరిపై దాడి చేసిన దుండగులను వెంటనే శిక్షించాలని కోరుతూ మండల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో బెజ్జూర్ ఎస్సై విక్రమ్ కు వినతి పత్రం అందజేశారు. అలాగే తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ అచ్యుత్ రావు కు వినతి పత్రం అందజేశారు..పత్రిక విలేకరులు శ్రీరామ మోహన్ చారి, శ్రీకాంత్, మహేందర్, మహేష్, నాగేష్, శ్రీనివాస్, దేవాజి, శ్రీనివాస్, తిరుపతి, దామోదర్, శ్రీనివాస్, లింగయ్య, నరేందర్, రవికుమార్ ,తదితరులు పాల్గొన్నారు.

## 'భారత్‌లో కరోనా కొత్త వేరియంట్ ప్రభావం లేదు'



భారత్‌లో కరోనా కొత్త వేరియంట్ ప్రభావం లేదని కేంద్ర ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. సింగపూర్‌లో కరోనా ఒమిక్రాన్ సబ్ వేరియంట్ %ఖా%.2 వైరస్ ఇన్ఫెక్షన్ కేసులు ఎక్కువగా ఉన్నాయని తెలిపింది. అయితే దాని ప్రభావం దేశంలో లేవని, ప్రజలను భయపడాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఇదిలా ఉండగా మహారాష్ట్రలోనే ఈ కొత్త వేరియంట్‌లో దాదాపు 91 కేసులు నమోదయ్యాయి. దీంతో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

## తొలి ఆత్మగౌరవ పతాక భాగ్యరెడ్డి వర్మ



**దుబ్బాక మే 22,**
తొలి ఆత్మగౌరవ పతాక భాగ్యరెడ్డి వర్మ అని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు.సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ 136 వ జయంతి సందర్భంగా బుధవారం నాడు దుబ్బాక మున్సిపాలిటీ పరిధి లచ్చపేట లోని భాగ్యరెడ్డి వర్మ విగ్రహానికి పూల మాలల వేసి జయంతోత్సవాలను జరిపారు.ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ఆది హిందు మహసభ పేరుతో దక్షణ భారత దేశ ప్రజలను అసమాతలకు వ్యతిరేకంగా చైతన్య పర్చుడాన్నారు.చదువు నిరాకరించిన స్త్రీల కు 26 పాఠశాల లను ఏర్పాటు చేసి స్త్రీల కు విద్యను అందించిన సామాజిక విప్లవకారుడు భాగ్యరెడ్డి వర్మ అని కొనియాడారు.డాక్టర్ అంబేద్కర్ తో కలిసి పని చేసి దళిత దేశ నేత అంబేద్కర్ ను ప్రకటించాడని గుర్తు చేశాడు.ఈ కార్యక్రమం లో కౌన్సిలర్లు కురపాటి బంగారయ్య, ఆస యాదగిరి,ప్రవీణ్, ఆత్మ కమిటి డైరెక్టర్ ఆస రవి,డిబిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు భీమ్ శేఖర్,అస ధశరధం,నందం,నాని, తదితరులు పాల్గొన్నారు.

## ఇక టీజీఎస్ ఆర్టీసీ .. టీజీతోనే బస్సుల రిజిస్ట్రేషన్

**హైదరాబాద్ :మే 22,**
రాష్ట్ర వ్యాప్తంగా వాహనాల రిజిస్ట్రేషన్ ను టీజీతోనే చేస్తున్న నేపథ్యంలో ఆర్టీసీ బస్సులను కూడా టీజీతోనే రిజిస్టర్ చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు ఆర్టీసీ లోగో, పేరులో మార్పులు చేయాలంటూ ఇప్పటికే ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందడంతో అధికారులు ఆ దిశగా




చర్యలు తీసుకుంటున్నారు.తెలంగాణ స్టేట్ రోడ్ ట్రాన్స్?పోర్ట్? కార్పొరేషన్?(టీఎస్? ఆర్టీసీ)ని టీజీఎస్?ఆర్టీసీగా మార్చాలని నిర్ణయించారు. రాష్ట్రంలో టీజీ అమలుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే గెజిట్?నోటిఫికేషన్? విడుదల చేసింది. అందుకు అనుగుణంగా తెలంగాణ ట్రాన్స్?పోర్ట్? అథారిటీ కూడా కొత్త వాహనాల రిజిస్ట్రేషన్?కు మార్చి 15వ తేదీ నుంచే టీజీ అమలు చేస్తున్నది. తాజాగా ఆర్టీసీ బస్సులకు సైతం టీజీ అమలు చేయాలని ఉత్తర్వులు వెలువడ్డాయని అధికారులు తెలిపారు. దీంతో ఇకపై ఆర్టీసీ బస్సులను కూడా టీజీ సిరీస్?తోనే రిజిస్ట్రేషన్ చేయించనున్నట్టు చెప్పారు.
ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 9,067 ఆర్టీసీ బస్సులు ఉండగా, వాటిలో 90 శాతం బస్సులు ఏపీ సిరీస్?తోనే ఉన్నాయి. తెలంగాణ ఏర్పాటు తర్వాత కొనుగోలు చేసిన బస్సులను మాత్రం టీఎస్? సిరీస్?తో రిజిస్ట్రేషన్? చేయించారు. కాగా, త్వరలో టీఎస్?ఆర్టీసీ లోగోలో కూడా మార్పు చేస్తామని అధికారులు తెలిపారు. ఇందులో టీఎస్ ఆర్టీసీ స్థానంలో టీజీఎస్?ఆర్టీసీ అని ఉంటుందని, లోగో డిజైన్? కూడా కొంత మారే అవకాశం ఉందని చెప్పారు. వచ్చే నెలాఖరు నాటికి దాదాపు 500 కొత్త బస్సులను కొనుగోలు చేయనున్నట్టు అధికారులు వెల్లడించారు.

## నకిలీ విత్తనాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘా

**నకిలీ విత్తనాలను విక్రయిస్తూ పట్టుబడితే కఠిన చర్యలు : జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్**

**భద్రాద్రి :మే 22,** :అమాయక రైతులను మోసం చేస్తూ అక్రమార్జనే ధ్యేయంగా కొంతమంది అక్రమార్కులు నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నారు.కొన్ని కంపెనీలు కాలం చెల్లిన విత్తనాలను రీసైక్లింగ్ చేసి కొత్త విత్తనాలు అని చెప్పి రైతులకు అమ్మడం ద్వారా సరైన దిగుబడి రాక రైతులు పెద్ద సంఖ్యలో నష్టపోతున్నారు.రైతులు నకిలీ విత్తనాల ముఠాల బారిన పడకుండా జిల్లా వ్యాప్తంగా వ్యవసాయాధికారులతో కలిసి సమన్వయం పాటిస్తూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ ఈ రోజు ఒక ప్రకటనలో వెల్లడించారు.జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని విత్తన దుకాణాలలో తనిఖీలు చేపట్టే విధంగా పోలీసు అధికారులకు ఆదేశాలను జారీ చేయడం జరిగిందని తెలియజేశారు.రైతులకు మేలు రకం విత్తనాలు విక్రయించే



విధంగా చేసి నకిలీ,కల్తీ విత్తనాలను సరఫరా చేసే వారిపై ఉక్కుపాదం మోపాలని రాష్ట్ర ప్రభుత్వం మరియు గౌరవ డీజీపీ గారి ఆదేశాల మేరకు నకిలీ విత్తనాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా అధికారులు అప్రమత్తతో సమాచారాన్ని సేకరించి కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని తెలిపారు.వానాకాలం సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్న సమయంలో నకిలీ విత్తనాలను విక్రయించేందుకు కొందరు వ్యక్తులు ప్రయత్నాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని,వారిని అరికట్టడంలో భాగంగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని విత్తనాలు దుకాణాల యజమానులకు పలు సూచనలు చేయడం జరుగుతుందని తెలిపారు.నకిలీ విత్తనాలను సరఫరా చేసే వారిని గుర్తించి వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి సమాచారం సేకరించి వారిపై కఠినంగా చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.లైసెన్స్ లు లేకుండా దుకాణాలను నడిపినా,రికార్ధులను సరైన పద్దతిలో మెయింటైన్ చేయకపోయినా,నకిలీ విత్తనాలను విక్రయించినా యజమానులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు ఆదేశాల జారీ చేయడం జరిగిందని తెలియజేసారు.రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా ప్రభుత్వ అనుమతి పొందిన సంస్థల నుంచి విత్తనాలను వినియోగించేలా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రైతులకు అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.నకిలీ విత్తనాలు ఇతర ప్రాంతాల నుండి జిల్లాకు రవాణా కాకుండా సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసి నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.అక్రమ రవాణాను జరిగే ప్రాంతాలు,మార్గాలను గుర్తించి ఆకస్మిక తనిఖీలు చేయడం,మొబైల్ చెక్ పోస్టులు ఏర్పాటు చేయడంతోపాటు నకిలీ మరియు కల్తీ విత్తనాల అక్రమ రవాణాను,సరఫరాను అరికట్టడం జరిగుతుందని తెలిపారు.

## ముద్ర బోయినవెంకన్న ఇంటికి వచ్చి కష్టసుఖాలు తెలుసుకున్న ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీరెడ్డి



**వర్ధన్నపేట ప్రతినిధి :మే 22**
రాయపర్తిమండలం, తిరుమలయపల్లి.గ్రామానికి చెందిన మాజీ ఇల్లందు వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ మండల ముఖ్య నాయకులు.ముద్రబోయిన వెంకన్న .కొద్ది రోజుల క్రితం ప్రమాదవశాత్తు గాయపడగా వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించిన.పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే హనుమాన్ల యశస్విని ఝాన్సీ రెడ్డి వారి కుటుంబానికి ధైర్యం చెబుతూ అన్ని రకాలుగా తన సహాయ సహకారాలు ఉంటాయని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తొర్రూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జాటోత్ హమ్యా నాయక్, మండల అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు నరోత్తం రెడ్డి, మండల నాయకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించిన ఎం.పి.డి.ఓ. బి.గోవిందరావు




**చెన్నారావుపేట,22 మే**
వరంగల్ జిల్లా,చెన్నారావుపేట మండల ఎం.పి.డి.ఓ. బి.గోవిందరావు ఝల్లి కాలనీ ప్రాథమిక పాఠశాలను సందర్శించడం జరిగింది.ఈ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ లో భాగంగా పనులు జరుగుతున్నాయి.ఈ పనులను ఎం.పి.డి.ఓ. క్షుణ్ణంగా పరిశీలించారు. పనులలో నాణ్యతను పెంచాలని తెలిపారు.ఈ పనులను త్వరితగతిగా జూన్ మొదటి వారంలోగా పూర్తి చేయాలని తెలిపారు. టాయిలెట్స్,కరెంట్ పనులను పరిశీలించి వారికి తగు సూచనలు,సలహాలు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎం.పి.డి.ఓ.ఆఫీస్ సుపర్డెంట్ బి.దయాకర్,పాఠశాల ఇంచార్జి హెడ్మాస్టర్ ఏ.మాదురి,వి.ఓ.ఎం.కోమల.మరియు సీఆర్పీ సంపత్,మెసెంజర్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి జిల్లాల సాంబాయిగూడెంలో విషాదం



**భద్రాద్రి : మే 22,** కారులో ఊపిరాడక మూడేళ్ల చిన్నారి మృతి..
తల్లిదండ్రులు ఇంట్లో నిద్రిస్తుండగా కారులో ఆడుకునేందుకు వెళ్లిన పాప.. కారు డోర్ లాక్ కావడంతో అందులోనే చిక్కుకుపోయిన చిన్నారి సాయి నిఖిత.. ఉదయం నిద్రలేచిన తర్వాత పాప కనిపించకపోవడంతో వెతికిన తల్లిదండ్రులు.. కారులో స్పృహతప్పి పడిపోయి ఉన్న చిన్నారిని గుర్తింపు.. ఆస్పత్రికి తరలించేలోపే మృతి.

## నేడు నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం




24 గంటల్లో వాయుగుండంగా అల్పపీడనం..
ఈశాన్య దిశగా కదులుతూ బలపడనున్న అల్పపీడనం..
నైరుతి బంగాళాఖాతానికి అనుకుని తమిళనాడు పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం..
5 రోజుల పాటు ఏపీ, తెలంగాణలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు.

## జనగామ జిల్లాకు వీరనారి “”చాకలి ఐలమ్మ” పేరును పెట్టాలి - ఏదునూరి నరేష్

**జనగామ: మే 22 :** జిల్లా కేంద్రంలో 22 మే 2024 బుధవారం తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షులు ఏదునూరి నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోలిపాక రాములు, అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక ,రాష్ట్ర కళామండలి ప్రధాన కార్యదర్శి యామంకి యుగేంధర్, సూర్యాపేట జిల్లా ఇంచార్జి బూతరాజు వెంకటేష్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఏదునూరి వీరన్న హాజరై మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం ఎట్టి చాకిరి విముక్తి కోసం రజాకర్లపై వీరోచితంగా పోరాడి ప్రపంచ దేశాలను అబ్బురపరిచిన గొప్ప వీరనారి చాకలి ఐలమ్మ.అంతేకాకుండా దొరలు భూములను తీసుకుని బహుజనులకు లక్షల ఎకరాలు పంచిన వీరవనిత అని వారన్నారు . జిల్లా అధ్యక్షులు ఏదునూరి నరేష్ మాట్లాడుతూ పోరాటాల గడ్డ ఐన జనగామకు చాకలి ఐలమ్మ జిల్లాగా పేరు పెట్టి ఆమెకు సముచిత స్థానం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఈ విషయంపై పునరాలోచన చేయాలని కోరారు. జనగామ జిల్లా కేంద్రంలో ఆధునిక దోబీ ఘాటు నిర్మించి, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని వారు కోరారు.




జనగామ జిల్లా కేంద్రంలో కీఎశేఎ ఉల్లెంగుల ప్రభాకర్ ,మరియు భువనగిరి జిల్లా వలిగొండ మండలం పహిల్వాన్‌పూర్ లో కీఎశేఎ బొడ్డుపల్లి నర్సింలు మరణించిన విషయం అందరికీ తెలిసిందే. వారి కుటుంబాలను పరామర్శించి వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది .

ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య సలహాదారులు మెంతెన కిష్టయ్య,జిల్లా కార్యదర్శి ఉల్లెంగుల రాజు,జిల్లా సంయుక్త కార్యదర్శి ఉల్లెంగుల చంద్రశేఖర్, బచ్చన్నపేట మండల అధ్యక్షులు కొన్నె వెంకటేష్,సూర్యాపేట జిల్లా ఇంఛార్జ్ భూతరాజు వెంకటేష్ ,భువనగిరి జిల్లా అద్యక్షులు జూపల్లి నగేష్, జిల్లా కార్యదర్శి మరిపెల్లి శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు.

# బ్లాక్ లో పత్తి విత్తనాలు అమ్ముచున్న నర్సంపేట లోని పరమేశ్వర సీడ్స్ యజమానిపై చర్యలు తీసుకోవాలి

## రైతాంగ సమస్యలను పరిష్కరించాలి

**వరంగల్: మే 22** నర్సంపేట లోని పరమేశ్వర సీడ్స్ మరియు తదితర షాపులలో బ్లాక్ చేసి అధిక ధరలకు పత్తి విత్తనాలను అమ్ముతున్నందున వారిపై చర్యలు తీసుకోవాలని, అలాగే రైతాంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, తెలంగాణ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నర్సంపేట ఆర్డీఓ గారికి వినతి పత్రం సమర్పించనైనది.
ఈ సందర్భంగా తెలంగాణ రైతు కూలి సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ వీర్ల పైడి మాట్లాడుతూ, వరంగల్ జిల్లాలోని నర్సంపేట పట్టణంలో గల పరమేశ్వర సీడ్స్ యజమాని పత్తి విత్తనాలను బ్లాక్ చేసి కృత్రిమ కొరతను సృష్టించి బిటి 2 యూ ఎస్ 7067 గల పత్తి గింజలకు ఎం ఆర్ పి రేటు 864 ఉండగా ప్యాకెట్ కు 1300 రూపాయలకు అలాగే నాద్ కంపెనీ సాకేత్ 2500 రూపాయల నుండి 3200 రూపాయల



వరకు ఒక ప్యాకెట్ చొప్పున బ్లాక్ లో పత్తి గింజలను అమ్మడం జరుగుతున్నది. కావున వెంటనే బ్లాక్ లో అమ్ముతున్న పరమేశ్వర సీడ్స్ యజమానిపై చట్టపరమైన తీసుకో చర్యలు తీసుకోవాలలి,అలాగే ప్రతి సంవత్సరం వరంగల్ జిల్లాలో నకిలీ విత్తనాల వలన రైతులు నష్టపోవడం జరుగుచున్నది. వ్యవసాయ సీజన్ ప్రారంభంలోనే వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు చేసి నకిలీ విత్తనాలు అరికట్టి రైతాంగాన్ని రక్షించాలని కోరుతున్నాము. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల మూలంగా రైతుల ధాన్యం తడిసిపోయింది. ఈ ధాన్యాన్ని మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలి ఐకెపి సెంటర్లలో మరియు రైస్ మిల్ యజమానులు, ప్రైవేట్ వ్యక్తులు రైతుల నుండి ధాన్యం కొనుగోలు సందర్భంలో, తేమ పేరుతో క్వింటాకు 5 కిలోల వరకు తరుగు తీస్తూ రైతులను నిలువను ముంచుతున్నారు. ఇలాంటి రైస్ మిల్లర్ల దోపిడీని అరికట్టాలి. రైతులకు ప్రభుత్వమే నేరుగా విత్తనాలను, ఎరువులను, పురుగుమందులను ఇన్పుట్ సబ్సిడీ ద్వారా అందించి, రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆర్డీఓ గారికి వినతి పత్రం సమర్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ బొర్రా ఆనంద్, నాయకులు ఈరెల్లి రామచందర్, భూమా అశోక్, బర్ల గౌరయ్య, పిండి బాలకొమురు, అజ్మీర శివరాం, పూల్ సింగ్, శివరాత్రి కుమారస్వామి ఎలకంటి కుమారస్వామి, బోనగిరి సారయ్య, అందె లక్ష్మీనారాయణ, భక్కతట్ల శోభ, భాషబోయిన అనిత,జునుగు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో కల్తీ విత్తనాల విక్రయాలపై ఉక్కు పాదం

### జిల్లాలో 70 కిలోల నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్న టాస్క్ ఫోర్స్ అధికారులు

**చింతల మానేపల్లీ: మే 22,** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కే సురేష్ కుమార్ ఐ.పీ.ఎస్ ఆదేశాల మేరకు జిల్లా లోని వివిధ మండలాల్లో నకిలీ పత్తి విత్తనాలు అమ్ముతున్నారన్న పక్కా సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ అధికారులు 22 మే 2024 బుధవారం రోజున చింతలమానే పల్లీ మండలం గూడెం గ్రామం మీదుగా, మహరాష్ట్రలోకి తరలిస్తున్న 70 కిలోల నకిలీ పత్తి విత్తనాలను పట్టుకోవడం జరిగింది. టాస్క్ ఫోర్స్ సీఐ రాణ ప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం. చింతలమానపల్లి మండలం గూడెం గ్రామం మీదుగా మహారాష్ట్ర కి పత్తి విత్తనాలు బైక్ మీద తరలిస్తున్నారు అన్న పక్క సమాచారం మేరకు గూడెం గ్రామం వద్ద వాహనాలను తనిఖీ చేయగా గూడెం గ్రామం నుండి బైక్ పైన వస్తున్న ఇద్దరు వ్యక్తులు వారు ముందుగా పోలీసు అధికారులను గమనించి వారి బైక్ పై ఉన్న పత్తి విత్తనాల రెండు సంచులను కింద పడేసి పారిపోవడానికి ప్రయత్నించిన క్రమంలో వారిలో ఒక్కరినీ పట్టుకొని అతడిని విచారించగా ఆతని పేరు 01). చపిలే వినోద్ సన్ /ఆఫ్ మధున్య, గంగాపూర్ గ్రామం చింతలమానపల్లె పారిపోయిన మిగితా ముగ్గురి వివరాలు అడగగా పారిపోయిన ముగ్గురు 02).చపిలెపురుషోత్తం, గంగాపుర్‌గ్రామం



03).బొల్లబోయోన అశోక్ భూపాల పట్నంల గ్రామం సిర్పూర్ టీ మండాల్ 04) బొల్లబోయోన క్రిష్ణ ,భూపాలపట్నం గ్రామం. సిర్పూర్ ‘టీ’ మండలం నిందితులు పరారీలో ఉన్నారు దొరకిన ఒక్కరిని అదు పులోకి తీసుకుని నలుగురిపై చింతలమా నపల్లీ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు టాస్క్ ఫోర్స్ సీ.ఐ తెలిపారు. వారి వద్ద నుండి 70 కిలోల నకిలీ పత్తి విత్తనాలు వాటి విలువ దాదాపుగా ఒక లక్ష యాభై వేల రూపాయలు ఉంటుందని వాటిని సీజ్ చేసి చింతలమనపాల్లి పోలీస్ స్టేషన్లో అప్పగించినట్లు సీఐ రాణ ప్రతాప్ తెలిపారు. అమాయక రైతులను మోసం చేసే వారిని, జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలు అమ్మేవారిపై కఠినమైన చర్యలు తీసుకుంటాం అని సీఐ హెచ్చరించారు. ఈ టాస్క్ లో సీ.ఐ రాణా ప్రతాప్, ఎస్ఐ వెంకటేష్, కానిస్టేబుల్ మధు, రమేష్, సంజీవ్ లు పాల్గొన్నారు.

# రద్దీ వేళ రైళ్లు రద్దు చేసి ప్రయాణికుల సహనాన్ని పరీక్షించొద్దు

**ఏడాదిగా ఇలాగేనా చేసేది? ... తక్షణం సమీక్షించాలి**
**కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాంద్రేగుల వెంకరమణ డిమాండ్**

**అనకాపల్లి : మే 22,**
నిర్వహణ పనులు (ట్రాఫిక్ బ్లాక్) పేరుతో ఎక్కువ సంఖ్యలో రైళ్లను తరచూ రద్దు చేస్తుండడంతో రైల్వే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాంద్రేగుల వెంకటరమణ ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం సమీక్షించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ రైల్వే బోర్డుకు బుధవారం లేఖను ఆయన పంపారు. అనంతరం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ అత్యాధునిక వ్యవస్థ కలిగిన రైల్వే శాఖ ఏడాదిగా నిర్వహణ, ఆధునీకీకరణ పనులు పేరుతో డిమాండ్ ఉన్న రైళు రద్దు చేస్తుందని, సీజన్, ప్రయాణికుల రద్దీని పరిగణలోకి తీసుకోకుండా రైళ్ల రద్దు, దారిమళ్లింపులు చేస్తుందని ఆయన ధ్వజమెత్తారు. రైల్వే ప్రయాణికుల హక్కులను కాలరాసే విధంగా రైల్వే అధికారులు వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఏ పనికైనా రైల్వే సిటిజన్ ఛార్టర్ ప్రకారం నిర్దేశిత గడువు ఉంటుందని, అయితే దానిని త్రోసిపుచ్చి ఏడాది పొడవునా రైల్వే ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. విజయవాడ నుంచి విశాఖపట్నం మధ్య నడిచే సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లో ప్రతి రోజూ పెద్దసంఖ్యలో ఉద్యోగులు, వ్యాపారులు ... ఏలూరు, నిడదవోలు, తాడేపల్లిగూడెం, రాజమహేంద్రవరం, అన్నవరం, విశాఖపట్నం



వరకు వెళుతుంటారు. ఈ రైలును గత కొంత కాలంగా నిర్వహణ పనుల పేరుతో రద్దు చేస్తుండడం విచారకరమన్నారు. ఇది ద్వారకా తిరుమల చిన వెంకన్న దర్శనానికి వెళ్లే భక్తులకు సౌకర్యంగా ఉండేదన్నారు. గుంటూరు, రాయగడ మధ్య నడిచే రైలును కూడా ఇలాగే ఆపేశారన్నారు. హౌరా మార్గంలో రైళ్లు ఎప్పుడూ రద్దీగా నడుస్తాయని, రిజర్వేషన్ కూడా సీజన్, అన్ సీజన్‌తో సంబంధం లేకుండా 4 నెలల ముందే బుక్ చేసుకుంటారని విజయవాడ, బిట్రగుంట మధ్య నడిచే రైళ్లదీ ఇదే పరిస్థితన్నారు. సాధారణ రోజుల్లో విజయవాడ నుంచి లక్ష మంది వరకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండగా వేసవి సెలవుల్లో ఇది రెట్టింపవుతుందని, ఈ సమయంలో సర్వీసులు ఆపేయడం ఎంత వరకు సబబని వెంకటరమణ ప్రశ్నించారు. అదే విధంగా దక్షిణ మధ్య, తూర్పు మధ్య రైల్వే డివిజన్లలోని బ్రాంచి లైన్లలో కూడా ప్రయాణికులు నరకయాతన పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మార్గాలు ఉదయం, సాయంత్రం వేళల్లో ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థుల రాకపోకలకు ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు.

నిత్యం రద్దీగా, ప్రయాణికులకు అనుకూలంగా ఉండే మచిలీపట్నం-విశాఖ ఎక్స్‌ప్రెస్ (17219), గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239), గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ (17243), తిరుపతి-విశాఖ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ (22708), విశాఖ-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ (17220), విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240), రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ (17244), విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ (22707), విశాఖ-గుంటూరు డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22701), గుంటూరు-విశాఖ డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22702), రాజమండ్రి-విశాఖపట్నం (07466), విశాఖ-రాజమండ్రి (07467) రైళ్లును రైల్వే శాఖ తాజాగా రద్దు చేయడం సమంజసం కాదని కాంద్రేగుల వెంకటరమణ ధ్వజమెత్తారు. తక్షణం ప్రయాణికుల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రైళ్లును పునరుద్దరించాలని రైల్వే బోర్డుకు వ్రాసిన లేఖలో ఆయన డిమాండ్ చేశారు.

# ఆమనగల్ ను రెవెన్యూ డివిజన్ గా చేయాలి


### జడ్పిటిసి అనురాధపత్యా నాయక్



**ఆమనగల్ : మే 22,** మన ఆమనగల్లు వ్యాపార పరంగా కానీ, అభివృద్ధి పరంగా కానీ, విద్యాపరంగా కానీ ఆమడ దూరంలో ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని మన ఆమనగల్లును పూర్వపు సమితి ప్రాంతాలను కలుపుతూ రెవెన్యూ డివిజన్ ఆర్డిఓ కేంద్రం ఏర్పాటు చేయాలని, ఆర్డీవో డివిజన్ కొరకై పార్టీలకతీతంగా త్వరలోనే ఈ ప్రాంత ప్రజలను కలుపుతూ రెవిన్యూ డివిజన్ సాధన కోసం, మండలాల వారిగా యువతను బలోబతం చేస్తూ...ఆర్డిఓ డివిజన్ సాధిద్దామని మన ప్రాంత వాసి ముఖ్యమంత్రి గా ఉన్నారు కాబట్టి మన ప్రాంతానికి న్యాయం చేస్తారని ఆశిస్తూ బుధవారం అమన గల్ జడ్పిటిసి అనురాధపత్యా నాయక్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప్పుల రాములు యాదవ్, యూత్ నాయకులు వెంకటేష్, రమేష్ నాయక్, ఆనంద్, కృష్ణవేణి నాయక్,గణేష్ నాయక్ పాల్గొన్నారు.

# కేన్స్ చిత్రోత్సవం... ఓ మరువలేని అనుభూతి

## నటి కియారా అద్వానీ వెల్లడి



'కేన్స్ చిత్రోత్సవాల్లో పాల్గొనడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తానని బాలీవుడ్ నాయిక కియారా అద్వాణీ అన్నారు. తనదైన నటనతో మెప్పించే ఈ భామ.. ఇటీవలే కేన్స్ చిత్రోత్సవాల్లో మెరిసి సినీప్రియుల దృష్టిని ఆకర్షించింది. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన 'ఉమెన్ ఇన్ సినిమా' అంశంపై జరిగిన చర్చా వేదికలో పాల్గొంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ వేడుకలోని తన అనుభవాలు, రాబోయే ప్రాజెక్టుల గురించి కొన్ని ఆసక్తిర విషయాలను కియార పంచుకుంది. కేన్స్ చిత్రోత్సవాలకు హాజరవ్వడం సంతోషంగా ఉంది. నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. ఇది నా కెరీర్‌లోనే ఎంతో మధురమైన జ్ఞాపకంగా ఉండిపోతుంది. దాదాపు 20ఏళ్ల క్రితం నా కుటుంబ సభ్యులతో కలిసి ఈ వేడుకకు హాజరయ్యాను. చిన్నప్పుడు దీని గురించి ఇంటర్నెట్ ద్వారా తెలుసుకునేదాన్ని. కానీ.. నేను ఒక సెలబ్రెటీగా ఇలాంటి ప్రతిష్ఠాత్మక వేడుకలో పాల్గొంటానని ఆ సమయంలో నాకు తెలీదు. కేన్స్ చిత్రోత్సవం నాకు ఎప్పటికీ మర్చిపోలేని ఒక అనుభవం' అంటూ ఆనందం వ్యక్తం చేసింది. యాక్షన్ చిత్రాల్లో నటించడానికి చాలా రోజుల నుంచి ఎదురుచూస్తున్నాను. 'వార్ 2', 'డాన్ 3'లతో ఆ కోరిక నెరవేరబోతుంది. ఇవి నా కెరీర్‌లోనే పెద్ద ప్రాజెక్టులు. ప్రేమకథలు, కామెడీ..ఇలా అన్ని జానర్లలో పనిచేశాను. కానీ చాలా కాలంగా పూర్తిగా యాక్షన్ నేపథ్యంలో సాగే చిత్రాల్లో నటించడం కోసం వేచి చూస్తున్నాను. ఆ అవకాశం ఇప్పుడు వచ్చింది. ఒకానొక సమయంలో 'షేర్షా' సినిమాలో నేను భాగమైనప్పుడు.. 'ఓ మై గాడ్ ఇదొక యుద్ధానికి సంబంధించిన యాక్షన్ చిత్రం. ఇలాంటి ప్రాజెక్టులో ఈమె నటిస్తుందా..?' అని కొంతమంది నా మీద విమర్శలు చేశారు. కానీ.. ప్రస్తుతం భారీ బ్జడెట్‌తో రూపొందుతున్న రెండు పెద్ద ప్రాజెక్టులు నా చేతుల్లో ఉన్నాయి. ఈ సినిమాల్లో నన్ను నేను నిరూపించుకోవడమే ముఖ్యం అని తెలిపింది.

# జెమినీలో రామాయణం సీరియల్

## 27 నుంచే ప్రారంభిస్తున్నట్లు వెల్లడి



పురాణాలలో 'రామాయణం' కి వున్నా వైశిష్ట్యం చాలాగొప్పది ఎందుకంటే శ్రీ మహావిష్ణువు మానవుడిగా జన్మించి ఎలా మసలుకోవాలి, ఎటువంటి ధర్మాలు పాటించాలి, ఎంతటి కష్టమొచ్చినా ధర్మాన్ని విడవకుండా ఎలా జీవనం సాగించాలి అని రాముని పాత్రలో చాటి చెప్పాడు. వాల్మీకి రచించిన ఈ రామాయణం ఎన్నిసార్లు విన్నా, చూసినా తనివి తీరదు అని చెపుతూ వుంటారు. రామరాజ్యం అన్న మాట రాముడు పరిపాలించిన తీరును బట్టి వచ్చింది. తండ్రి మాటకి కట్టుబడి, తండ్రిని ధర్మపథంలో నిలబెట్టడానికి అడవికి వెళ్లిన రాముడు, తండ్రి మాటని జవదాటని కొడుకుగా, ఏకపత్నీవ్రతుడిగా, ప్రజల క్షేమం కోసం ధర్మం తప్పని రాజుగా, అందరికి ఆదర్శంగా నిలిచిన శ్రీరామగాథను ఎన్ని సార్లు చూసినా తనివి తీరదు.అటువంటి రాముని చరిత్ర 'రామాయణం' మరోసారి తెలుగులో టీవిలో ప్రసారం కానుంది. ఇంతకీ ఈ రామాయణం సీరియల్ ఎక్కడ ప్రసారం అవుతోంది, ఎప్పటి నుండి కానుంది అంటే, ఈ నెల 27వ తేదీ నుండే. జెమిని టివిలో మే 27వ తేదీ సోమవారం సాయంత్రం గం. 6.30 లకు ఈ దృశ్యకావ్యం 'శ్రీమద్ రామాయణం' సీరియల్ ప్రసారం కానుంది అని నిర్వాహకులు చెపుతున్నారు. శ్రీ మధ్ రామాయణం'. ఈ సీరియల్ లో శ్రీరాముని అవతార విశిష్టత, జన్మ వృత్తాంతం, లంకాధిపతి అయిన రావణాసురుడి జన్మ వృత్తాంతం మొదలుకుని రామాయణంలోని అన్ని ఘట్టాలను కనులకు కట్టినట్లుగా అద్భుతమైన సాంకేతిక విలువలతో అత్యద్భుతంగా చిత్రీకరించి శ్రీ రామ గాథను జెమిని టివి అభిమాన ప్రేక్షకులందరికి ఎప్పటికి గుర్తుంది పోయేలా అందించడం జరుగుతోంది అని చెపుతున్నారు.శ్రీ వాల్మీకి విరచిత రామాయణం 'శ్రీమద్ రామాయణం' గా సూపర్ గ్రాఫిక్ టెక్నాలజీతో, అనుభవజ్ఞులైన నటీనటుల నటనతో, మనుసుని ఆకట్టుకునే మాటలతో, ప్రతి తెలుగు ప్రేక్షకుడిని అలరించడానికి మే 27వ తేదినుండి సోమవారం నుండి శనివారం వరకు, ప్రతి రోజు సాయంత్రం 6 గంటల 30 నిమిషాలనుండి 7 గంట 30 నిమిషాల వరకు ప్రసారం కానుంది.

# హాలీవుడ్ మ్యాగజైన్‌లో దీపికా పదుకొణె

డెడ్‌లైన్స్ గ్లోబల్ డిస్‌రప్టర్స్ అనే హాలీవుడ్ మ్యాగజైన్ ప్రతీ ఏడాది.. ప్రపంచవ్యాప్తంగా వినోదరంగంలో రాణిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న ప్రముఖ నటీనటుల జాబితాను విడుదల చేస్తుంది. ఇటీవలే విడుదల చేసిన ఈ ఏడాది జాబితాలో ప్రముఖ బాలీవుడ్ అగ్రతార దీపికా పదుకొణె చోటు దక్కించుకుంది. ఈ గౌరవాన్ని అందుకున్న ఏకైక భారతీయ నటిగా దీపిక నిలిచింది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న దీపిక తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ..కొన్ని ఆసక్తికర విషయాల్ని తన అభిమానులతో పంచుకుంది. 'నటించిన సినిమా విజయం అందుకోవాలి, బాక్సాఫీసు వద్ద కాసుల వర్షం కురవాలి, పాత్ర మెప్పించాలి, సినీ ప్రియులు కథనంతో పాటు సాగిపోయేలా కథలను ఎంపిక చేసుకోవాలి, అవార్డులు ప్రశంసలు దక్కాలి, మంచి స్థాయిలో ఉండాలి..ఇలా ఇవే ముఖ్యమంటారు కొందరు నటీనటులు. నా దృష్టిలో ముఖ్యమైనవి ఏమైనా ఉన్నాయంటే అది ఒక మంచి వ్యక్తిగా ఎదగడం, మంచి వ్యక్తులతో సమయం గడపడం, సెట్‌లోని అనుభవాలను మర్చిపోలేని జ్ఞాపకాలుగా గుర్తుచేసుకోవడం. ఇవే నాకు ముఖ్యం. ఇప్పుడీ గౌరవానికి కూడా కారణం అదే అని నా అభిప్రాయం'. ప్రపంచం చాలా చిన్నదై పోయిందని నేను అనుకుంటున్నా. సినీ రంగంలోని పరిశ్రమలన్నీ ఒక్కచోట చేరి ఈ ప్రపంచానికి గొప్ప కథలు చెప్పేందుకు సిద్ధమవుతున్నాయి. మనం చెప్పే కథల వల్లే ఈ ప్రపంచంలో మార్పులు వస్తున్నాయని నేననుకోవట్లేదు. ప్రేక్షకులు మెచ్చేలా, ఆశ్చర్యపోయేలా, ఆసక్తికరమైన కథలు మాత్రమే మనం చెబుతున్నాం. అదే జరుగుతుంది కూడా'. 'ఓం శాంతి ఓం' సినిమా కోసం నేను అసలు ఆడిషన్ ఇవ్వలేదు. 2007లో విడుదలై మంచి విజయాన్ని అందుకున్న ఈ చిత్రంతోనే నేను బాలీవుడ్‌కి పరిచయమయ్యా. దర్శకుడు ఫర్హాన్ అక్తర్ ఏ ఆడిషన్ చేయకుండానే నన్ను ఎంపిక చేశారు.




# గం.. గం.. గణెశా'తో వస్తోన్న ఆనంద్ దేవరకొండ

## 31న విడుదల కానున్న చిత్రం




'గం.. గం.. గణెశా'తో ఆనంద్ దేవరకొండ థియేటర్లలో సందడి చేయనున్నారు . ఆయన హీరోగా నటించిన ఈ చిత్రాన్ని ఉదయ్ శెట్టి తెరకెక్కించారు. కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి సంయుక్తంగా నిర్మించారు. ప్రగతి శ్రీవాస్తవ, నయన్ సారిక కథానాయికలు. ఈ సినిమా ఈ నెల 31న విడుదల కానుంది.

ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో ట్రైలర్‌ను విడుదల చేశారు. దర్శకుడు వంశీ పైడిపల్లి, రచయిత విజయేంద్ర ప్రసాద్ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయేందప్రసాద్ మాట్లాడుతూ.. 'దర్శకుడు ఉదయ్ నా దగ్గర పని చేశాడు. అంకిత భావం, కష్టపడే తత్వం ఉన్న వ్యక్తి. ఈ సినిమా తప్పకుండా విజయవంతమవ్వాలని కోరుకుంటున్నానని అన్నారు. బేబి' ట్రైలర్ జులైలో విడుదల చేశాం. అప్పుడు వర్షం పడింది. ఇప్పుడు మేలో ఈ ట్రైలర్ విడుదల చేశాం. ఇప్పుడూ వర్షం పడింది. 'బేబి'లాగే ఈ సినిమాతోనూ ఆనంద్‌కు విజయం దక్కాలని కోరుకుంటున్నా' అన్నారు దర్శకుడు వంశీ పైడిపల్లి. హీరో ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ.. 'తొలిసారి ఈ సినిమాలో ఓ హుషారైన విభిన్నమైన పాత్ర పోషించా. భయం, అత్యాస, కుట్ర అనే అంశాల్ని కేంద్రంగా చేసుకుని అల్లుకున్న క్రైమ్ కామెడీ ఇది. చిత్రసీమలో ఎవరైనా ఏదైనా సాధిస్తే కొన్ని గ్రూప్స్ మాత్రమే సెలబ్రేట్ చేస్తున్నాయి. అది సరికాదు. మనమంతా మన ఇండస్టీ వాళ్లు సాధించే విజయాల్ని వేడుక చేసుకోవాలి' అన్నారు. 'వినాయక చవితి చుట్టూ తిరిగే కథతో ఈ సినిమా రూపొందించాం. వినోదాత్మకంగా ఉంటూనే ట్విస్ట్‌లు థ్రిల్ పంచుతాయి' అన్నారు దర్శకుడు ఉదయ్. కార్యక్రమంలో సాయి రాజేశ్, సారిక, కేదార్, అనురాగ్ తదితరులు పాల్గొన్నారు.

# సుధీర్ బాబు హరోంహర విడుదల వాయిదా




సింగిల్ స్క్రీన్ సినిమా హాల్స్ కొన్ని రోజులపాటు మూసి వేస్తున్నామంటూ ఒక పక్క ప్రకటనలు వస్తుంటే, ఇంకో పక్క, సుమారు ఒక అరడజను సినిమాలు మే 31న విడుదల చేస్తున్నామంటూ ప్రకటించారు. ఆలా ప్రకటించిన వాటిలో సుధీర్ బాబు నటించిన 'హరోం హర' సినిమా కూడా వుంది. జ్ఞానశేఖర్ ద్వారక ఈ చిత్రానికి దర్శకుడు, మాళవిక శర్మ కథానాయికగా నటించింది. సునీల్ ఒక ముఖ్య పాత్రలో నటించారు. చిత్తూరు నేపథ్యంలో జరిగిన ఒక పీరియడ్ డ్రామా ఇది. సుధీర్ బాబు, తన మామయ్య కృష్ణ గారి పుట్టినరోజు అయిన మే 31 సందర్భంగా ఈ సినిమా విడుదల చేద్దామని ముందుగా అనుకున్నారు. అయితే ఇప్పుడు ఆ తేదీకి విడుదల చెయ్యలేకపోతున్నామని, జూన్ 14 కి విడుదల వాయిదా వేశామని చెపుతున్నారు. మే 31 మిస్ అయినందుకు ఒక పక్క బాధగా వున్నా, జూన్ నెలలో విడుదల చేస్తున్నందుకు తనకి బాగా కలిసి వచ్చిన నెల అది అని చెపుతున్నారు సుధీర్ బాబు. ఎందుకంటే తన సినిమాలు 'సమ్మోహనం', 'ప్రేమ కథా చిత్రం' ఈ జూన్ నెలలోనే విడుదలై మంచి విజయాలు సాధించాయని చెపుతున్నారు. ఇప్పుడు ఈ 'హరోం హర' కూడా ఈ జూన్ 14న విడుదలై తనకి మంచి విజయాన్ని అందిస్తుందని ఆశిస్తున్నట్టుగా చెపుతున్నారు సుధీర్ బాబు. ఈ సినిమాలో సుధీర్ బాబు చిత్తూర్ యాసలో తన మాటలు చెపుతారని, ఇందుకోసం ప్రత్యేకంగా శిక్షణ కూడా తీసుకున్నట్టుగా తెలుస్తోంది.


# రామాయణం కోసం ప్రత్యేక శ్రద్ధ

## బంగారు ఆభరణాలనే ఉపయోగించబోతున్న టీమ్



భారతీయ పురాణెతిహాసం రామాయణం ఆధారంగా నితేష్ తివారి తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రామాయణ'. రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి, రావణుడిగా యశ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవల చిత్రీకరణ మొదలైన సంగతి తెలిసిందే! భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికర విషయం బయటకొచ్చింది. దీంట్లో రావణుడి పాత్రధారి ధరించనున్న దుస్తులు, ఆభరణాలు వాడే వస్తువులు అన్నీ నిజమైన బంగారంతో తయారు చేసినవే వినియోగించనున్నట్లు సమాచారం. ఎందుకంటే రావణుడు స్వర్ణ నగరమైన లంకకు అధిపతి. ఆయన ధరించిన వస్త్రాలు కూడా పసిడి మయమేనని ఇతిహాసాల్లో చెప్పారు. అందుకే సినిమాలోనూ ఆ పాత్రను అలాగే చూపించే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో యశ్ ముఖ్య పాత్ర పోషించడమే కాకుండా నిర్మాతగానూ వ్యవహరిస్తున్నారు. దీన్ని భారతీయ భాషలతోపాటు పలు విదేశీ భాషల్లోనూ ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాను.

# సికిందర్ ఆఫర్ అందుకున్న రష్మిక



స్టార్ హీరోల సరసన అలరిస్తోన్న రష్మిక తాజాగా మరో క్రేజీ ఆఫర్ అందుకున్నారు. బాలీవుడ్ అగ్ర కథానాయకుడు సల్మాన్ ఖాన్ సినిమాలో అవకాశాన్ని సొంతం చేసుకున్నారు. ఆ విషయాన్ని ఖరారు చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. 'మీరు ఎన్నో రోజులుగా నా సినిమా అప్‌డేట్స్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మీకోసమే ఈ సర్‌ప్రైజ్. 'సికందర్'తో మీ ముందుకు వస్తున్నాను. ఇంత గొప్ప ప్రాజెక్ట్‌లో నటించే అవకాశం రావడం ఎంతో ఆనందంగా, గౌరవంగా ఉంది' అని పేర్కొన్నారు. ఇది ఆమె 25వ సినిమా కావడం విశేషం. తమిళ దర్శకుడు ఎ.ఆర్ మురుగదాస్ దర్శకత్వంలో సల్మాన్ ప్రధానపాత్రలో నటిస్తోన్న చిత్రమే 'సికందర్'. సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో మొదట కియారా అద్వాణీ కథానాయికగా ఎంపికైనట్లు వార్తలు వచ్చాయి. తాజాగా రష్మికను తీసుకున్నట్లు టీమ్ పోస్ట్ పెట్టింది. భావోద్వేగాలతో కూడిన యాక్షన్ చిత్రమిదని, సామాజిక అంశం కూడా ఉంటుందని తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మురుగదాస్ తెలిపారు. వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.

Owner, Editor, Printed & Published : Gillala Buchi Reddy 12-114/1/85, Krishna Sai Nagar, Peerzadiguda, Medipally Mandal, Medchal-Malkajgiri District -500098. Telangana. Printed at S.A Printers,D-No. 3-92 Shed No 2, Sy No 45 & 49, Sadasiv Nagar, Narapally Village, Ghatkasar Mandal, Medchal-Malkajgiri District -500098, Telangana, RNI NO : TELTEL/2023/86487 Cell: 8125972476. website : quicktodaynews.com .com, e-mail : quicktodaynews@gmail.com